ప్రజలే ప్రభువులు

# జనబలం

డిసెంబర్ 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-





## OPS టైం బాంబ్.. మేలుకోండి

### దేశ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు ప్రచారం ప్రారంభించిన FDR



## బీసీ గణన

### మైనారిటీ, దళిత క్రైస్తవ రిజర్వేషన్లు


ఆ తల్లి మన ప్రభుత్వం,
ఆ అరిచే కొడుకు మన ప్రభుత్వోద్యోగులు
ఒక తల్లికి ముగ్గురు కొడుకులు. ఒక కొడుకు ఎప్పుడూ గట్టిగా అరుస్తుంటాడు. రెండో కొడుకు మూగవాడు. మూడో కొడుకుకి కళ్లు కనపడవు. ఒకరోజు తల్లి మూడు రొట్టెలు చేసి అరిచే కొడుకుకి రెండున్నర రొట్టెలు పెట్టింది. అర రొట్టె మూగ కొడుకుకి పెట్టింది. కళ్లు కనిపించని కొడుకు.. 'అమ్మా, ఆకలేస్తోంది' అనడిగాడు. 'ఏమీలేవు నాయనా' అని తల్లి చెబుతుంది. 'రొట్టెల వాసన వస్తోంది గదా అమ్మా' అనడుగుతాడు. 'పక్కింట్లోవాళ్లు చేసుకున్న రొట్టెల వాసన మనకొస్తోంది నాయనా, మంచినీళ్లు తాగి పడుకో' అంటుంది.
.. ఇది ధర్మంగా ఉందా?
ఆ తల్లి మన ప్రభుత్వం, గట్టిగా అరిచే ఆ కొడుకు ప్రభుత్వోద్యోగులు. ఆ అరవలేని, తెలియనివాళ్లు అసంఘటితరంగంలోని 97% ప్రజలు.
- విజయేంద్ర ప్రసాద్,
ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యులు
SAY NO TO
Old Pension Scheme
REFUSE IT DEFUSE IT!
SCAN HERE TO VOTE
WWW.REFUSEOPS.IN

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 12
డిసెంబర్ 2023

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు


| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఉచితాలు ! - అనుచితాలు !!

ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు కూడా వెలువడ్డాయి. రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కొలువు తీరుతున్నాయి. తాము ఎన్నికైతే అమలు చేయబోయే పథకాలను అన్ని రాజకీయ పక్షాలు తమ ఎన్నికల ప్రణాళికల్లో ప్రకటించాయి. ప్రధాన రాజకీయపక్షాల అగ్రనేతలు ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు గ్యారంటీలను ప్రకటించారు. పార్టీల పేరుతో కొన్ని, వ్యక్తుల పేరుతో కొన్ని ప్రకటించిన గ్యారంటీలకు మంచి ప్రాచుర్యం కూడా లభించింది! అందులో ఎన్నో ఉచితమూ ఉన్నాయి. అనుచితమూ ఉన్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి రాజకీయ పక్షాలు పోటీపడి ప్రకటించే ఉచిత పథకాల ప్రభావం, రాజకీయ ఎంపికలను , పోలింగు సరళిని, ప్రభావితం చేస్తున్నదని గతంలో చాలా సందర్భాల్లో రుజువు అయ్యింది.

ఫలితాలు ఎవరికి అనుకూలమో , ఎవరికీ వ్యతిరేకమో అనే సంగతి పక్కన బెట్టి చూస్తే ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఉచితాల ప్రభావం లేదని చెప్పలేం! అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ చేసిన ఒక సర్వేలో 41 శాతం ఓటర్లు తమకు ఎవరు ఉచిత పథకాలు బాగా ఇస్తే వారికే ఓటు వేస్తామని చెప్పారు. అలాంటి ధోరణి ఒకటి భారతీయ రాజకీయ సంస్కృతిలో బలంగా పాతుకుపోయింది. ఉచితాల సంస్కృతిని చాలామంది విమర్శించడం చూస్తూ ఉంటాం. అది ఒక్కోసారి ప్రజల్ని ఈసడించేదిగా కూడా కనిపిస్తూ ఉంటుంది.

అయితే కొన్ని సామాజిక స్థితిగతులు ఉచితాలకు తావు ఇస్తున్నాయన్న వాస్తవాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి! ఉచితాల్లో ఏది ఉచితం , ఏది అనుచితం అనే విచక్షణ కూడా అవసరం. అన్ని ఉచితాలనూ ఒకే గాటన కట్టి మాట్లాడటం కూడా సరైంది కాదు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాల వల్ల ప్రభుత్వంపై విశ్వాసం, సంతృప్తి పెరుగుతాయని, ప్రజల ఇబ్బందుల పట్ల ప్రభుత్వాల స్పందన, జవాబుదారీతనం వ్యక్తం అవుతుందని సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఒక అధ్యయనంలో అభిప్రాయపడింది. ఉత్తరప్రదేశ్ తమిళనాడు రాష్ట్రాల్లో చేసిన అధ్యయనంలో ఉచిత లాప్‌టాప్, సైకిళ్ళు, నగదు బదిలీ వంటి ఉచితాలు ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్నీ పెంచాయని వెల్లడైంది. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బడిపిల్లలకు సైకిళ్ళు ఇవ్వడం వల్ల పాఠశాల నమోదు గణనీయంగా పెరిగిందని, డ్రాప్ ఔట్ రేటు తగ్గిందని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది.

పుస్తకాలు , మధ్యాహ్న భోజనం, వంటివి పాఠశాల నమోదును స్థిరపరిచాయని పిల్లల నైపుణ్యాలను, అభ్యసనా సామర్థ్యాలను పెంచడంలో ఉచితాలు ఉపయోగపడ్డాయని కూడా నీతి ఆయోగ్ పేర్కొన్నది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం దాదాపు 28 కోట్లమందికి ఏటా వందరోజుల పనిని గ్యారంటీ చేసింది. అందులో అవినీతి , అక్రమాలు జరుగుతున్న మాట నిజమే! లోపాలు ఎన్నున్నా ఇప్పటికి సుమారు పదిలక్షల కోట్లరూపాయల సొమ్ము పేదకుటుంబాలకు అందింది. ఆ సొమ్ము పేదల ఆర్థిక శక్తిని, ఉత్పాదకతను, కొనుగోలు శక్తిని పెంచిందని, వారా సొమ్మును మార్కెట్‌లో వినియోగించడం వల్ల దేశ జీడీపీ స్థిరంగా కొనసాగుతోందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. సబ్ ప్రైమ్ ఆర్థిక సంక్షోభ సమయంలో ప్రపంచంలోని అగ్రరాజ్యాల జీడీపీ అతలాకుతలం అయిన రోజుల్లో సైతం భారత్ జీడీపీ 8 శాతం వద్ద నిలకడగా ఉండటానికి 'నరేగా' తోడ్పడిందని, తద్వారా పేదల్లో కొనుగోలు శక్తి పెరిగిందని ఆ అధ్యయనాలు స్పష్టం చేశాయి. నరేగాను ఒక పనికిమాలిన పథకం అంటూ రాజకీయంగా కొందరు నేతలు విమర్శించినా దాన్ని రద్దు చేయకుండా వివిధ ప్రభుత్వాలు కొనసాగించడం వెనుక ఆంతర్యం తేటతెల్లమే! తమకు అందిన అదనపు సొమ్మును కొందరు పేదలు తాగుడుకు ఖర్చు చేస్తున్నారన్న విమర్శలో కొంత నిజం ఉంది. అయితే అత్యధిక పేద కుటుంబాలు, ముఖ్యంగా మహిళలు తమకు వచ్చిన సొమ్ముతో టీవీలు, మోపెడ్లు, మిక్సీలు, గ్రైండర్లు, కుక్కర్లు, గ్యాస్ పొయ్యిలు వంటి గృహోపకరణాలు కొనుగోలు చేసుకున్నారని, నివాస గృహాలలో చిన్న చిన్న సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నారని కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఇలాంటి సొమ్ము ద్వారా మార్కెట్‌లో డబ్బు చెలామణీని నిలబెట్టడంలోని ప్రాధాన్యాన్ని ఆర్థికవేత్తలు ఎప్పుడూ స్వాగతిస్తూనే ఉంటారు.

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో ఒకపక్క ప్రచారం కొనసాగుతుండగానే "ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన" పథకాన్ని 2024 జనవరి నుండి మరో ఐదేళ్ళపాటు పొడిగిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. దీని ప్రకారం దేశంలో ఎనభై కోట్లమందికి ప్రతినెలా 5 కిలోల బియ్యం, గోధుమలు, తృణధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తారు. అందుకోసం 11 లక్షల 80 వేల కోట్ల రూపాయల మేరకు ఖర్చుచేస్తారు. కరోనా కాలంలో ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. తర్వాత 2023 డిసెంబరు వరకూ పొడిగించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అమలవుతున్న ఈ పథకంలో 2022 -23 సంవత్సరంలో 5 కోట్ల 13 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పంపిణీ చేసినట్లు

ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో వెల్లడించింది. ఉపాధి కోల్పోయి కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ తోడ్పడిన వాస్తవాన్ని మరచిపోకూడదు. పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాలకు కొన్ని ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు వీలుగా సంక్షేమ పథకాలు అమలు చేయడం అవసరమేనని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఐరాస, యు.ఎన్ డి.పి., అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలు స్పష్టంగా చెబుతున్నాయి. భారత్ లో పేదరిక నిష్పత్తిని 7 శాతం మేరకు తగ్గించడంలో ఆహార సబ్సిడీ, పౌర పంపిణీ వ్యవస్థ వంటివి తోడ్పడ్డాయని ప్రపంచ బ్యాంకు అధ్యయనం వెల్లడించింది. ఆరోగ్యం కోసం పేదలు తమ జేబులోంచి చేసే ఖర్చును తగ్గించడంలో భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య బీమా పథకాలు ఫలితాన్ని చూపుతున్నాయని జాతీయ నమూనా సర్వే సంస్థ చేసిన అధ్యయనం వెల్లడించింది.

అలాగే అప్పుల్లో మునిగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతు కుటుంబాలు ఊపిరి పీల్చుకోవడానికి రుణమాఫీ , రైతు భరోసా వంటివి తోడ్పడుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేర్కొన్నది. రైతుల రుణాల చెల్లింపు సామర్థ్యాన్ని పునరుద్ధరించడానికి ఇలాంటి రుణ మాఫీ పథకాలు తోడ్పడతాయని రిజర్వ్ బ్యాంక్ పేర్కొన్నది.

పేదరిక నిర్మూలన, ఆహార భద్రత, అందరికీ విద్య, అందరికీ ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి సమస్యల పరిష్కారంలో ఉచిత పథకాల అమలు కీలకపాత్ర పోషిస్తాయని ఆర్థిక నిపుణులు ఎప్పుడూ నొక్కి చెబుతుంటారు. అయితే ఎన్నికల్లో ఒక నిరంతర తారక మంత్రంగా ఉచిత పథకాలు కొనసాగించడం సమంజసం కాదన్న గ్రహింపు కూడా అవసరం.

రాజకీయ పక్షాలు రకరకాల పేర్లతో నగదు బదిలీలను విచక్షణా రహితంగా పెంచుకుంటూ పోవడం ఒక తీవ్ర సమస్యగా నేడు పరిణమిస్తున్నది. ఆర్థిక వనరులను, ఆర్థిక క్రమశిక్షణను, బడ్జెట్‌లను, బడ్జెట్ నియంత్రణలను పట్టించుకోకుండా ఉచితాలను పెంచుకుంటూ పోవడం ఆయా సమాజాల ఆర్థిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి అప్పులు చేసి మరీ ఉచితాలను ప్రకటిస్తున్నాయి. దాంతో వడ్డీ భారం తడిసి మోపెడు అవుతోంది.

అయినా మన నేతలకు పట్టడం లేదు. ప్రజలు పన్నుల ద్వారా సమకూర్చిన బడ్జెట్లను రాజకీయనేతలు తమ సొంత జాగీరుల్లా భావిస్తూ పందేరాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే దేశంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలు బడ్జెట్లను చిక్కుల్లో పడేస్తున్నాయి. గత పదేళ్ళలో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు దాదాపు 14 లక్షల కోట్ల రూపాయల రుణాలను పారు బాకీలుగా ప్రకటించాయి. ఉద్దేశ్యపూర్వకంగా రుణాలు ఎగవేసిన దాదాపు 2300 మంది పెద్దలు భారీ మొత్తంలో ప్రజాధనాన్ని కైంకర్యం చేశారు. రుణమాఫీలు, రాజీలు, వన్ టైమ్ సెటిల్ మెంట్లు, కొత్త రుణాల మంజూరు వంటి చర్యలు ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బ తీస్తున్న సంగతి కూడా గమనిస్తున్నదే!

ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్న కార్పొరేట్ మోసాలను అరికట్టే వ్యూహం కూడా అంతే అవసరం. పెరుగుతున్న సంపదను కొందరు వ్యక్తులు సొంతం చేసుకోవడంతో సామాజిక ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రం కావడం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ప్రభుత్వాలకు ఆర్థిక సామర్థ్యం సమకూరాలంటే ఆర్థికమోసాలను, సంపద లూటీని అరికట్టడం అవసరం!

అభివృద్ధి - సంక్షేమం మధ్య సమతుల్యత ఉండాలని అందరూ అంగీకరిస్తారు. కానీ ఎన్నికలు వచ్చేసరికి నేతలకు పూనకం వస్తుంది. వనరుల సమీకరణ గురించిన ఆలోచనే ఉండదు. ఇష్టా రాజ్యంగా ఉచితాల వాగ్దానాలను కుమ్మరిస్తారు. ఎన్నికల వేదికలనుండి చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా నేతలంతా చేసే ప్రసంగాలు చూస్తే వేలంవెర్రి గుర్తుకు వస్తుంది.

ఉచిత పథకాల అమలులో జవాబుదారీతనం గానీ , పారదర్శకత గానీ లేకపోగా అందులో అవినీతి కూడా చొరబడటం ఇటీవలి పరిణామం. ఉచిత పథకాల కట్టడి గురించి ఆలోచించాలని ఇటీవల సుప్రీంకోర్టు చేసిన సూచన స్వాగతించదగినది.

పౌర సమాజం , మీడియా దీన్ని పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవలి ఎన్నికల సందర్భంలో దీనిపై చర్చ జరిగి ఉంటే బాగుండేది! మన దేశంలో రాజకీయచర్చ భావోద్వేగాలు చుట్టూ కొనసాగుతోంది తప్ప దేశ ఆర్థిక వాస్తవికతల చుట్టూ జరగడం లేదు. విద్య , ఆరోగ్యం , నైపుణ్యాలు , ఉపాధి , సుస్థిర అభివృద్ధి, సామాజిక వివక్షల తొలగింపు వంటివి చర్చలో భాగం కావడంలేదు.

దేశ ఆర్థిక ఆరోగ్యం కోసం, సుస్థిరప్రగతి కోసం ఇకనైనా లోతైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్, కాగ్ వంటి రాజ్యాంగ సంస్థలు, పార్లమెంటు, రాజకీయపక్షాలు, పౌర సమాజం ఆ దిశగా చర్చను ప్రారంభించాలి.

డి. సోమ సుందర్

# OPS టైం బాంబ్..మేలుకోండి

## దేశ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు ప్రచారం ప్రారంభించిన ఎఫ్‌డీఆర్




ప్రభుత్వోద్యోగుల పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)పై దేశ ఆర్థిక వ్యవస్థకు, భవిష్యత్ తరాలకు ఎంత వినాశకరమో తెలియచేస్తూ రాజకీయ పార్టీలు, ఉద్యోగులు, ప్రజలు, ఆలోచనాపరుల కళ్లు తెరిపించే మూడు సినిమా టీజర్లను 'The Inevitable' పేరుతో ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్‌లోని రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి, ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్, ప్రముఖ సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ పాల్గొన్నారు.

ఓపీఎస్ ఒక టైంబాంబ్ అని, అందులోని గడియారం ముల్లు తిరుగుతోందని, ఇప్పుడు మేలుకోకపోతే ఆ టైంబాబ్ పేలటం, దేశం నాశనమవటం ఖాయమని ఈ టీజర్లు హెచ్చరిస్తాయి. ఓపీఎస్ వల్ల ఇప్పటి, రాబోయే తరాల పన్ను చెల్లింపుదారులపై ఎంతటి పెనుభారం పడుతుందో, వారి జీవితాల్ని ఆ పథకం ఎంత ప్రమాదంలోకి నెడుతుందో బలంగా తెలియచేస్తాయి. గణాంకాలు, లోతైన విశ్లేషణతో కూడిన ఈ అంశాన్ని తేలిగ్గా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పటం కోసం, ఓపీఎస్ ప్రమాదంపై ఆలోచించి ఓటు వేసేలా వారిని చైతన్యపరచటం కోసం ఈ ప్రచారాన్ని రూపొందించారు. www.refuseops.in లో ఓటు వేసేలా ప్రోత్సహించటం ద్వారా ఓపీఎస్‌కు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించటం ప్రచారంలో కీలకాంశం.

ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితుల్ని, ఓపీఎస్ ప్రభావాన్ని గణాంకాలతో సహా వివరిస్తూ ప్రస్తుత ఎన్నికల సంవత్సరంలో ఓపీఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయటం ఎందుకు అవసరమో ఈ సందర్భంగా జేపీ స్పష్టంగా తెలియచేశారు.

దేశం కార్మికశక్తిలో కేవలం 3.2% ఉన్న ప్రభుత్వోద్యోగులకు ఓపీఎస్ వర్తింప చేయటం మిగిలిన 97% ప్రజల మీద, వచ్చే తరాల మీద విపరీత భారమై మొత్తం దేశం భారీ మూల్యం చెల్లిస్తుందని, ఓపీఎస్ లాంటి ప్రమాదకర అంశాలు పొంచి ఉన్నందున ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు జేపీ విజ్ఞప్తి చేశారు. పన్ను చెల్లింపుదారులపై అలవికాని, అమలు అసాధ్యమైన భారాన్ని నివారించేందుకు ఆచరణసాధ్య పరిష్కారాలపై మనం వెంటనే దృష్టి సారించాలన్నారు. ఏ పరిష్కారమైనా కూడా ఉద్యోగులు, యాజమాన్యం ఎప్పటి కప్పుడు కొంత డబ్బు పెన్షన్ నిధిలో జమ చేసే పద్ధతి ఉండాలి తప్ప ఇవాళ ఒక్క రూపాయి కూడా మదుపు చేయకుండా భారం భవిష్యత్తు తరాల మీద వేయటం ఆమోదయోగ్యం కాదన్నారు.

పాత పెన్షన్ విధానం వల్ల అప్పులు చేసి మరీ పెన్షన్లు ఎలా చెల్లించాల్సి వస్తోందో, దేశ ఆర్థిక స్థిరత్వానికి, పరపతికి ఎంత ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉన్నాయో జేపీ గణాంకాలతో




సహా వివరించారు. ప్రభుత్వాల పన్నుల ఆదాయంలో ప్రస్తుతం 18% కేవలం ప్రభుత్వోద్యోగుల పెన్షన్లకే పోతోందని, మిగిలిన 97% ప్రజల పట్ల ఇది తీవ్ర అన్యాయమని తెలిపారు. ఓపీఎస్ కేవలం రిటైరయ్యే సమయంలో జీతాన్ని బట్టి కాకుండా, డీఏలు, నిరంతరం పెరిగే జీతాలకనుగుణంగా భారీగా పెరుగుతుంటుందని, అందువల్లే పది వేలతో రిటైరైన ప్రభుత్వోద్యోగికి 60 వేల పెన్షన్ వస్తున్న సందర్భాలున్నాయన్నారు. అంటే, ఎప్పుడో అందించిన సేవలకు ఇప్పటి లెక్కల ప్రకారం జీతాల్ని పెన్షన్లుగా ఇస్తున్నారన్నారు. ప్రజల జీవనకాలం పెరుగుతూ వారికి చెల్లించాల్సిన పెన్షన్లు పెరుగుతుండటం వల్ల ఓపీఎస్ ప్రభావం ప్రభుత్వ ఆదాయాల మీద, భవిష్యత్తు తరాల మీద అనూహ్య స్థాయిలో ఉంటుందన్నారు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన దేశంలో ఇది ఆచరణసాధ్యం కాదు, అమలు అసాధ్యమన్నారు. ఓపీఎస్ దేశ ఆర్థిక వ్యవస్థకు వినాశకరమనటంలో మరో మాటకు తావులేదన్నారు.

ఓపీఎస్ భారమవుతుండటం వల్లే 2004లో కొత్త పెన్షన్ విధానం తెచ్చారని, మళ్లీ ఓపీఎస్‌కి తిరోగమించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తుంటే, మిగిలిన 97% ప్రజలకూ అన్యాయం చేస్తూ కొన్ని రాజకీయ పార్టీలు రేపటిని గూర్చి ఆలోచించకుండా అందుకు హామీ ఇచ్చాయని జేపీ అన్నారు. ఓపీఎస్‌కు తిరోగమిస్తే దేశం తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోతుందని, ప్రభుత్వం చేయాల్సిన చట్టబద్ధపాలన, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులకు ఇక డబ్బు ఉండదన్నారు. రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో ప్రభుత్వాలు ఇప్పటికే ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీల చెల్లింపు కోసం అప్పులు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర, యూనియన్ స్థాయిలో అప్పులు–జీడీపీ నిష్పత్తి 28.7%, 57% గా ఉందని, ఇది ఎఫ్ఆర్‌బీఎం చట్ట నిబంధనల ఉల్లంఘన అన్నారు.

పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు తెలియచేస్తున్నాయని జేపీ పేర్కొన్నారు. రాష్ట్రం తిరిగి ఓపీఎస్‌కి వెళ్తే, 2041 నాటికి రాష్ట్రం ఆదాయానికి 220% జీతాలు, వడ్డీలు, పెన్షన్లకే ఖర్చవుతుందని, 2050 నాటికి ఆ ఖర్చు 294%కి పెరుగుతుందన్నారు. ఓపీఎస్ వల్ల అప్పులు–జీడీపీ నిష్పత్తి 2040 నాటికి 77%కి, 2050 నాటికి 107%కి ఎగబాకుతుందన్నారు. చివరకు జీతాలు, పెన్షన్లు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం కుప్పకూలుతుందన్నారు. పౌరులు, ఉద్యోగులు దయనీయ పరిస్థితులు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. టైంబాంబ్ పేలకముందే మేలుకొని ఈ సంక్షోభానికి తక్షణ, ఆచరణసాధ్య పరిష్కారాలను తక్షణం అమలు చేయాల్సుందని జేపీ విజ్ఞప్తి చేశారు.

## FDR

భారతదేశ రాజకీయాలు, పరిపాలనలో మౌలిక మార్పుల కోసం సుస్థిర కృషి చేస్తున్న సుప్రసిద్ధ థింక్ ట్యాంక్ ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్). మన ప్రజాస్వామ్యం ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే నిజమైన ఫలితాలనిచ్చేందుకు లోతైన పరిశోధనలు చేయటంతోపాటు ఆ పరిష్కారాల్ని విస్తృతంగా ప్రచారం చేసి ప్రజాభిప్రాయాన్ని సమీకరించే కార్యక్రమాల్ని ఎఫ్‌డీఆర్ నిర్వహిస్తుంది. ఎఫ్‌డీఆర్ సంస్కరణ ప్రతిపాదనలు వాస్తవాలు, సాక్ష్యాలు, తర్కం, ప్రపంచంలోని అత్యుత్తమ పద్ధతుల ఆధారంగా, అదే సమయంలో భారతీయ పరిస్థితుల కనుగుణంగా ఉంటాయి. పరిస్థితులు, సందర్భం అనుకూలించగానే రాజకీయ వ్యవస్థ ద్వారా ఆయా సంస్కరణలను అమలు చేయించేందుకు ఎఫ్‌డీఆర్ చొరవ చూపుతుంది. అలా అనేక కీలక సంస్కరణల్ని, విధాన మార్పుల్ని సాధించింది. ప్రస్తుతం ఓపీఎస్ మీద ఎఫ్‌డీఆర్ సర్వశక్తులతో పోరాడుతోంది.

# The Inevitable సందేశం



**ఓపీఎస్ అంటే ఏమిటి?**

పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అనేది రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వోద్యోగులకు మాత్రమే వర్తించే పింఛను పద్ధతి. స్వతంత్రం వచ్చినప్పుడు యధాలాపంగా ప్రవేశపెట్టిన ఈ విధానం ఉన్నకొద్దీ ఆర్థిక భారమవుతూ రాబోయే కొన్ని సంవత్సరాలలో అమలు అసాధ్యమయ్యే పరిస్థితులు ఏర్పడటంతో 2004 నుంచి ఉద్యోగులకు ఓపీఎస్ స్థానంలో కాంట్రిబ్యూటరీ జాతీయ కొత్త పెన్షన్ విధానం అమలు ప్రారంభించారు. ఒక్క పశ్చిమ బెంగాల్ మినహా అన్ని రాష్ట్రాలూ ఈ కొత్త పెన్షన్ పద్ధతిలోకి మారాయి. దేశంలో మొత్తం పనిచేసేవారిలో ప్రభుత్వోద్యోగులు కేవలం 3.2%. కానీ ఓపీఎస్ వల్ల వీరికి తమ చివరి జీతంలో 50% పెన్షన్ రావటంతోపాటు డీఏలు, పే రివిజన్ పెంపు వల్ల అది నిరంతరం పెరుగుతూంటుంది. ఏ స్థాయిలో పెరుగుతుందంటే, ఇరవై వేలతో రిటైరయ్యే ఉద్యోగికి 80 వేలు పెన్షన్ వస్తున్న సందర్భాలున్నాయి. ఇప్పుడు ప్రయివేటులో పనిచేస్తున్న టీచర్‌కు వస్తున్న జీతం కంటే, ఎప్పుడో ప్రభుత్వంలో టీచర్‌గా పనిచేసిన రిటైరైనవారికి కొన్ని రెట్లు ఎక్కువ పెన్షన్ వస్తోంది. పాత పెన్షన్ విధానంలో ప్రభుత్వోద్యోగి, ప్రభుత్వం ఇద్దరూ సర్వీసు కాలంలో ఒక్క పైసా జమ చేయరు. నిరంతరం భారీగా పెరుగుతుండే పెన్షన్ భారం మొత్తాన్నీ భవిష్యత్ తరాల మీద పన్నుల భారంగా మోపుతారు. రిటైరైనవారి సంఖ్య పెరుగుతూ వారి జీవనకాలం పెరుగుతున్నకొద్దీ ప్రభుత్వ ఖజానా నుంచి రిటైర్మెంట్ చెల్లింపులు ఇంకా ఇంకా పెరిగిపోతుంటాయి.

ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఓపీఎస్ అనేది నిరంతరం పెరుగుతూ, భవిష్యత్తులో ప్రభుత్వ ఆదాయాల నుంచి నేరుగా, చట్టబద్ధంగా, ఏళ్ల తరబడి చెల్లించాల్సిన భారం. తక్షణం మేలుకొని రాబోయేకాలంలో చెల్లించాల్సిన పెన్షన్లకు ఈవేళ ఏర్పాట్లు చేయకపోతే ఓపీఎస్ ఆర్థిక భారం దేశాన్ని నాశనం చేస్తుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు.

**ఓపీఎస్‌పై సినిమా ద్వారా ఎందుకు ప్రచారం చేస్తున్నాం?**

**మూడు చిత్రాలు, ఒక సందేశం - ఓపీఎస్ పర్యవసానాలు**

ఓపీఎస్ వినాశకర పర్యవసానాలను తేలిగ్గా అర్థమయ్యేలా తెలియచెప్పే మూడు చిత్రాలను ఎఫ్‌డీఆర్ విడుదల చేస్తోంది. ఓపీఎస్ ప్రమాదాన్ని ఈ చిత్రాలు గడియారం ముల్లు తిరుగుతున్న టైంబాంబ్‌తో పోల్చి చూపాయి. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన సందేశాన్ని అత్యంత శక్తిమంతంగా తెలియచెప్పాయి.

**ఫిల్మ్ 1: ఇంట్లో**

ఒక ఇంట్లో కుటుంబంలోని వారందరూ తమతోపాటు బాంబు ఉండటం చూసి ఒక్కసారిగా షాక్ తింటారు. దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుంది. మన మీద, మన కుటుంబాల మీదా పడబోయే ఓపీఎస్ భారానికి ఈ చిత్రం అద్దం పడుతుంది. ఇల్లంటే సురక్షితత్వం, ఓ భరోసా. ఆ భరోసా కాస్తా నిముషాలు, సెకండ్లు గడుస్తున్నకొద్దీ చెల్లాచెదురవుతుంటుంది.

**ఫిల్మ్ 2: బస్సులో**

బస్సులో వెళ్తున్న ప్రయాణికులకు ఇదో అనూహ్యమైన మలుపు. తమతోపాటు బాంబు ఉందని గుర్తించగానే బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేత పట్టుకుంటారు. సాధారణ ప్రజల జీవితాల్ని ఓపీఎస్ ఎంత కకావికలు చేస్తుందో ఈ చిత్రం చెబుతుంది.

**ఫిల్మ్ 3: ఆస్పత్రిలో**

తమతో పాటు బాంబు ఉందని వైద్య సిబ్బంది, రోగులు హఠాత్తుగా గుర్తించగానే బతుకును అందించే ఆస్పత్రి కాస్తా రణరంగంలా మారి ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది. జీవితాల్ని తీవ్ర అనిశ్చితిలోకి నెట్టే ఓపీఎస్‌కి ఇందులోని బాంబు సంకేతం.

**ఓపీఎస్ పరిణామాల్ని టైంబాంబ్ ద్వారా తెలియచెప్పటం**

ఓపీఎస్ దేశానికి, భవిష్యత్తు తరాలకి ఎంత ప్రమాదకరమో ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లటానికి టైంబాంబ్ థీమ్ ఉపయోగపడింది. ఎలాగైతే ఈ చిత్రాల్లోని వ్యక్తులు దిక్కుతోచని పరిస్థితులను ఎదుర్కొన్నారో అదే తరహాలో ఇవాళ రూపాయి జమ చేయని ఓపీఎస్ కూడా ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీసి పౌరుల్ని ప్రమాదకర పరిస్థితుల్లోకి నెడుతుంది. ఓపీఎస్ అనే టైంబాంబ్ పేలకముందే మేలుకోవాలని సమాజానికి ఎఫ్‌డీఆర్ విజ్ఞప్తి చేస్తోంది.

**ఓపీఎస్ ప్రభావం, పరిణామాలు**

- ప్రభుత్వాలకు వచ్చే పన్నుల ఆదాయంలో 18% ఇప్పటికే పనిచేసేవారిలో కేవలం 3.2% ఉన్న ప్రభుత్వోద్యోగుల పెన్షన్లకే పోతోంది.
- కాలం గడుస్తున్నకొద్దీ ఈ పెన్షన్లు పైన పేర్కొన్న కారణాల వల్ల విపరీతంగా పెరిగిపోతాయి.
- ఈ పెన్షన్లు చట్టబద్ధం కాబట్టి, విధిగా చెల్లించాలి కాబట్టి ప్రభుత్వాలు పెన్షన్ భారం పెరుగుతున్నకొద్దీ ఇంకా ఇంకా అప్పులు చేయాల్సి ఉంటుంది.
- అప్పులతో ప్రభుత్వ పరపతి తగ్గిపోవటంతో కొత్త అప్పులకు ఎక్కువ వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది.
- దీంతో ప్రభుత్వాలు చేయాల్సిన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు మొదలైనవాటికి డబ్బు మిగలదు.
- ఆర్థిక ప్రగతి దెబ్బతిని, ఆదాయాలు స్తంభించి, ప్రభుత్వాలకు వనరులు పడిపోతాయి. ప్రభుత్వం మరింత తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంది, కోట్ల మంది పేదలవుతారు.
- దేశంలోని చాలా రాష్ట్రాలలో ఆర్థిక పరిస్థితులు ఇప్పటికే దిగజారాయి. పలు రాష్ట్రాలు తమ స్థాయికి, తమకు నిర్దేశించిన పరిమితికి మించి అప్పులు తీసుకున్నాయి. రాష్ట్రాలు గనక మళ్లీ ఓపీఎస్‌కి మళ్లితే, పెన్షన్ల సంగతి అలా ఉంచి జీతాలు కూడా ఇవ్వలేని రోజులు రావటం ఖాయం.




ఓపీఎస్ వల్ల ఏదో లాభపడతామన్నది భ్రమ అని ఉద్యోగులు గుర్తించాలి.

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన సమగ్ర వివరాల ప్రకారం, ఓపీఎస్‌ను తిరిగి కొనసాగిస్తే జీతాలు, పెన్షన్లు, వడ్డీల చెల్లింపుకే 2050 సంవత్సరం నాటికి రాష్ట్ర సొంత ఆదాయానికి 300%, 2100 నాటికి 700 శాతం అధికంగా ఖర్చవుతుంది. ఇటువంటి పరిస్థితి రాకముందే యూనియన్ ప్రభుత్వం ఆర్థిక ఎమర్జెన్సీ విధించాల్సి వస్తుంది. దేశాన్ని అప్పుల బారి నుంచి కాపాడటానికి తీవ్ర చర్యలు అవసరమవుతాయి. చివరికి జీతాలు, పెన్షన్లు అందటమే అసాధ్యమవుతుంది. జింబాబ్వే, వెనిజువెలా, గ్రీస్, పాకిస్తాన్, శ్రీలంక ఆర్థిక దివాలా పరిస్థితులు ఎదుర్కోవటానికి తమ ప్రజల జీవితాల్ని కకావికలు చేస్తూ ప్రభుత్వ వనరుల్ని పన్నుల్ని ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేయటమే కారణం.

**ఎఫ్‌డీఆర్ ఈ సంక్షోభంపై ఏ రకంగా కృషి చేస్తోంది, ఓపీఎస్‌ను ఆపటానికి మనం ఏం చేయాలి?**

భారత్‌లో ప్రజాస్వామ్యం వేళ్లూనుకునేలా చేసేందుకు ఎన్నికలు, రాజకీయ వ్యవస్థలో సంస్కరణలపై ఎఫ్‌డీఆర్ కృషి చేస్తోంది. ఇది దీర్ఘకాల ప్రాజెక్టు. కానీ ఈవేళ ప్రభుత్వం పన్నుల డబ్బును, వనరుల్ని సరైన రీతిలో ఖర్చు చేయకపోతే భవిష్యత్ భారతాన్ని నాశనం చేసే ప్రమాదమవుతుంది. ఓపీఎస్‌కి తిరోగమించటం అంతిమంగా ప్రభుత్వాల్ని దివాలా తీయిస్తుంది. కాబట్టి, ఎన్నికైన ప్రభుత్వాలు అటువంటి ప్రమాదకర చర్యలు తీసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవటం భారతదేశ భవిష్యత్తుకు ఎంతో అవసరం. ప్రభుత్వోద్యోగులు 3.2% మాత్రమే ఉన్నా వాళ్లకి గొంతుంది, సంఘటితంగా ఉంటారు, వ్యవస్థలోని బలహీనతలు బాగా తెలుసు. తమ బలాల్ని వాళ్లు ఈవేళ సమాజానికి, చివరికి తమ జీతాలు, పెన్షన్లకు కూడా దీర్ఘకాలంలో జరిగే పెనుప్రమాదాన్ని గుర్తించకుండా వినియోగిస్తూ ఓపీఎస్ కోసం డిమాండ్ చేస్తున్నారు. పైకి ఎటువంటి హానికరం కాదని అనిపించే ఓపీఎస్ వల్ల సమాజానికి జరిగే అపార నష్టాన్ని మిగిలిన 97% మంది ప్రజలూ ఇప్పుడు గుర్తించలేకపోతున్నారు. పౌరులంతా మేలుకోవాలి, తమ గొంతు వినపడేలా చేయాలి. మనందరం ఓపీఎస్‌ను వ్యతిరేకించాలి. **www.refuseops.in** క్లిక్ చేసి ఓపీఎస్‌కి వ్యతిరేకంగా ఓటు వేయాలి. మనం బ్యాలెట్‌లో వేసే ఓట్ల కన్నా ఈవేళ ఓపీఎస్‌కి వ్యతిరేకంగా ఈ వెబ్‌సైట్‌లో వేసే ఓటు ఎంతో విలువైనది. 3% మందికి ఓపీఎస్ ఇస్తే, మిగిలిన 97% మంది మద్దతును కోల్పోతామని రాజకీయ పార్టీలు గుర్తించేలా చేయాలి.

VOTING LINKS
www.refuseops.in

# రాజకీయాలకు ఇంగితజ్ఞానాన్ని, లక్ష్యాన్ని పునరుద్ధరిద్దాం

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

మన దేశంలో ప్రజాస్వామ్యం అంటే, హడావుడి, ఆర్భాటం, వేలం వెర్రి కలగలసిన కోలాహలం. మన ఎన్నికలు అట్టహాసపు ప్రచారంతో హోరెత్తుతుంటాయి. జాతరను తలపిస్తాయి. తరలివచ్చిన లేదా తరలించిన జనం పెద్దసంఖ్యలో కనిపిస్తేనే మన దృష్టిలో రాజకీయ సభ. పోటీ అత్యంత తీవ్రంగా ఉంటుంది. ఎన్నికల ఫలితాలపై ఎటుచూసినా ఎనలేని ఉత్కంఠ. ఎక్కడ నలుగురు కలిసినా దాదాపు అదే సంభాషణ. ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడతారు?

ఎన్నికల సమయంలో పోటీ రెండు రకాలుగా ఉంటుంది. గెలుపు కోసం పార్టీలు కళ్లాలు లేని గుర్రాల్లా పోటీపడుతుంటాయి. ఎన్నికల్లో చేసే ఖర్చు, వెచ్చించే శక్తిసామర్థ్యాలు, నైపుణ్యం, తపన ఊహకు కూడా అందవు. మన తలసరి ఆదాయంతో పోల్చి చూసుకుంటే మనం ఎన్నికల్లో చేసే ఖర్చు అసాధారణం.

ఎన్నికల సమయం వచ్చిందంటే, పార్టీల అభ్యర్థిత్వం కోసం పోటీ చెప్పనలవి కాదు. పార్టీ 'టికెట్' కోసం కుమ్ములాటలు, కప్పగంతులు ఔరా అనిపిస్తాయి. ఏదోకరకంగా పార్టీ 'టికెట్' సంపాదించాలనుకునేవారు 'హై కమాండ్' దృష్టిలో సీరియస్ అభ్యర్థులుగా గుర్తింపు పొందేందుకు కొన్నేళ్లపాటు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారు.

ప్రజలు, ప్రజాప్రయోజనాలు, విధానాలు వీటి పట్ల కించిత్తు నిజమైన ఆసక్తి లేనివాళ్లు సైతం పార్టీ అభ్యర్థులు కావాలని తహతహలాడతారు. మల్లయుద్ధంలోలా తలపడతారు. వెర్రి బలప్రదర్శన చేస్తారు.

ఒక్క ఓటు తగ్గితే ఎన్ని ఓట్లు వచ్చినా ఓడిపోయినట్లే అనే మన ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ ఎన్నికల పద్ధతిలో ఓటర్లకు రకరకాల ప్రలోభాలను ఎర వేస్తుంటారు. డబ్బు, మద్యం, బహుమతులు, కమ్యూనిటీ ఆస్తులు వగైరాలు. ఎన్నికల్లో గెలుపు కోసం ఇంత వేలంవెర్రి పోటీ మరెక్కడా కనిపించదు.

ఈ పిచ్చి స్థానిక ఎన్నికల్లోనూ కనిపిస్తుంది. దేశంలోని చాలా ప్రాంతాల్లో స్థానిక ప్రభుత్వాలు బలహీనమైనవి. అక్కడ డబ్బు, అధికారం ఉండదు, ఊరికే ఉత్సవ విగ్రహాలు. అయినా కూడా తగ్గేదేలే అని పదవి కోసం పోటాపోటీగా ఎగబడుతుంటారు. పరిమిత కార్యకలాపాలుండే సహకార సంఘాల్లో కూడా ఎన్నికలు అమీతుమీ అన్నట్లు జరుగుతుంటాయి. సర్వశక్తుల్నీ ఒడ్డుతారు.

పరపతి సహకార సంఘాల్లో కోట్ల మంది నిశ్శబ్ద సభ్యులు ఉంటారు. ఈ ఎన్నికల్ని కూడా అసెంబ్లీ, పార్లమెంటు సాధారణ ఎన్నికల్ని తలపించేలా నిర్వహిస్తారు. ఓటు వేసేందుకు భారీ క్యూలుంటాయి, ఓటర్లను డబ్బుతో ప్రలోభపెడతారు, ప్రతి



సహకార సంస్థ అధ్యక్షుడి ఎన్నికకూ ముందు క్యాంపులు నిర్వహిస్తారు. రాజకీయ పార్టీలు, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు సహకార ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావిస్తాయి.

స్థానిక ప్రభుత్వాలు, సహకార సంస్థల నాయకత్వ ఎన్నిక చాలా సందర్భాల్లో పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. ఎన్నికైన ప్రజాప్రతినిధులే తమ నుంచి అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అటువంటి సందర్భాల్లో ఎన్నికల పిచ్చి కేవలం సభ్యులు, ప్రజల ఓటింగ్‌కి పరిమితం కాదు. కిడ్నాప్‌లు, 'క్యాంపుల' నిర్వహణ, భారీ మొత్తాల్లో డబ్బు ఎర, ఎన్నుకునేవాళ్లని బెదిరించటం, వారిపై జులుం చేయటం, తిమ్మినిబమ్మిని చేసి ఓడినవాళ్లను మెజారిటీపరులుగా మార్చటం, కొద్దిపాటి మెజారిటీ ఉన్న పార్టీ లేదా బృందం అధికార పీఠాన్ని నిలబెట్టుకునేలా చేయటం మన దేశంలో సర్వసాధారణమయ్యాయి. అటువంటి అసంబద్ధమైన, లక్ష్యం లేని రాజకీయానికి మనం అలవాటు పడిపోయాం. ఎందుకో అర్థంకాని అధికారం, పదవి, గుర్తింపు పట్ల వెర్రి వ్యామోహాన్ని ప్రదర్శిస్తున్నాం.

1992లో భారతీయ సహకార బ్యాంకుల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల బృందంలో భాగంగా నేను నెదర్లాండ్స్ సందర్శించాను. అక్కడి సహకార రంగంలో సుప్రసిద్ధ రాబోబ్యాంక్‌ను అధ్యయనం చేయటానికి, పద్ధతుల్ని నేర్చుకోవటానికి ఉద్దేశించిన పర్యటన అది. ఆ సమయంలో రాబోబ్యాంక్ ఆస్తులు, డిపాజిట్లు భారత్‌లోని షెడ్యూల్డ్ బ్యాంకులన్నిటి మొత్తం కంటే ఎక్కువ. ఆ సంస్థ పరిధిలో 80కి పైగా స్థానిక బ్యాంకులున్నాయి. ఆ మాతృసంస్థల నుంచి ఏర్పడిన అత్యున్నత సంస్థ రాబోబ్యాంక్.



భారీగా ఆస్తులు, సమాజంలో పలుకుబడి ఉన్నా, అక్కడి నాయకత్వ స్థానాల్లో ఖాళీలు ఏర్పడినప్పుడు అత్యుత్తమ నాయకుల్ని, అది కూడా తరచుగా ఏకాభిప్రాయంతో ఎన్నుకుంటారు. పదవికి ఎన్నికై నాయకత్వం చేపట్టాలని పేరు, సామర్థ్యం ఉన్న వారిని ఇతర సభ్యులు ఒప్పించాల్సి ఉంటుంది. ఒక స్థానిక బ్యాంకును నడపటం ఎంతో బరువైన బాధ్యతగా వారు భావిస్తారు. పదవికి ఎన్నికవటమంటే వ్యక్తిగత జీవితాల్ని, వృత్తి వ్యాపారాల్ని పణంగా పెట్టి ఎంతో సమయం, శక్తిసామర్థ్యాల్ని వెచ్చించాల్సి ఉంటుందని తటపటాయిస్తారు, హోదా, పలుకుబడి, వనరులు ఉన్న అధికార స్థానాల్ని స్వీకరించటం పట్ల విముఖత చూపే వారి తీరుకి, భారతదేశంలో మన ప్రవృత్తికి ఎంత తేడా! అధికారం, గుర్తింపు వస్తాయంటే, ఏమిటి, ఎందుకు అన్న ఇంగితజ్ఞానం కూడా లేకుండా ప్రతి అవకాశానికీ ఎగబడటం మన సంస్కృతి.

రాబోబ్యాంక్ జాతీయ నాయకత్వ స్థానం ఖాళీ అయినప్పుడు, యాజమాన్య బోర్డులోని అత్యధిక సభ్యులు డచ్ ప్రభుత్వంలోని అధికార కూటమికి అనుబంధంగా ఉన్నవారు. ఒకే ఒక్కరు ప్రతిపక్ష కూటమికి చెందిన సభ్యుడు. అయితే ఆ సభ్యుడినే ఎన్నుకోవాలని వారంతా ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు! భారతీయ సమాజంలో అలా జరగటం ఊహించగలమా? మనకి అదో షాక్, అసాధ్యమైన అద్భుతం.

బోర్డు సభ్యులకు చాలా స్పష్టత ఉంది: రాజకీయ, సైద్ధాంతిక విషయాల్లో వాళ్లేమీ రాజీ పడరు. గట్టిగా పోటీ పడతారు. ప్రతిపక్షానికి అధికారం రాకుండా శాయశక్తులా ప్రయత్నిస్తారు. కానీ ఆర్థిక లావాదేవీలను ఆకళింపు చేసుకోవటం, బ్యాంకు నిర్వహణ, భవిష్యత్తుకు సన్నద్ధమవటం మొదలైన విషయాలకొస్తే ఆ ఒకే ఒక్క ప్రతిపక్ష నేత వారి అత్యుత్తమ ఎంపిక!

వ్యక్తిగత లాలస, కులం, ఆటవిక భావోద్వేగాలు, ఫ్యూడల్ పెత్తందారీ ధోరణుల నుంచి బయటపడి మన ప్రయోజనమేంటో మనకు అలా స్పష్టంగా అర్థమై ఎన్నికల్లో ఆ రీతిలో వ్యవహరించటానికి మనకు కొన్ని దశాబ్దాలు పట్టవచ్చు.

కొన్నేళ్ల క్రితం నేను కర్ణాటకలోని ఒక పేద, మారుమూల గ్రామంలో ఉన్నాను. స్థానిక సర్పంచ్ వచ్చి తన కుమారుడు



జీవితంలో స్థిరపడటానికి సహాయంగా రూ. 1.5 లక్షల అప్పు కావాలని అడిగారు. ఆయన గ్రామ సర్పంచ్‌గా గెలవటానికి 10 లక్షలు ఖర్చు పెట్టారని విన్నాను, అంత స్తోమతు లేనప్పుడు పిల్లల అవసరాల్ని కూడా ఆలోచించకుండా ఎందుకంత ఖర్చు పెట్టారు? అని అడిగా.

ఆయన అద్భుతంగా, సమాజం కళ్లు తెరిపించేలా సమాధానమిచ్చారు. చేతుల్ని తల మీద పెట్టుకుని “ఉన్మాదం సార్, ఉన్మాదం”! అన్నారు. ఉన్మాదం అనే సంస్కృత పదాన్ని కన్నడంలో రోజువారీ భాషలో ఉపయోగిస్తుంటారు. వెర్రి, పిచ్చి, మూర్ఖత్వం అని ఆ పదానికి అర్థం.

మనకు ఎన్నికలంటే సమర్థ పరిపాలన, మన ప్రయోజనాలేంటో అర్థం చేసుకోవటం కాదు. ఎన్నికలంటే మన దృష్టిలో చాలామట్టుకు నాకు వ్యక్తిగతంగా గుర్తింపు ఉందా, నా కులం, మతం, ఆటవిక భావోద్వేగాలు, ఫ్యూడల్ పెత్తనం.

ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువ అనే వ్యవస్థ వల్ల ఈ రకమైన సాంస్కృతిక ధోరణి మన సమాజంలో పాతుకుపోయింది. సమానావకాశాలు లేని సమాజం కావటంతో అనేకమందిలో అభద్రతాభావం నెలకొని ఉనికి, గుర్తింపు కోసం అర్రులు జాస్తుండటంతో సంకుచితత్వం మరింత పెరిగిపోయింది. రాజకీయ నాయకుల పట్ల మనలో చాలామందికి ద్వేషం ఉండొచ్చు, కానీ వారిలో చాలామంది అవినీతితో డబ్బు సంపాదించాలని రాజకీయాల్లోకి రాలేదన్నది నిజం. ఎన్నికల సమయంలో వాళ్లు చేసే ఖర్చు, మోహరించే సంస్థాగత బలం, ప్రదర్శించే సామర్థ్యాల్ని గనక పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిగా ఉపయోగిస్తే మరింత ఎక్కువ డబ్బు సంపాదించగలరు. అందుకు బోలెడన్ని మార్గాలున్నాయి.

మనకు రాజకీయ సంస్కరణలు అవసరమనేది నిర్వివాదాంశం. ఎన్నికల వ్యవస్థ, చట్టబద్ధపాలన, వికేంద్రీకరణ తప్పనిసరి. కానీ ఇదే సమయంలో రాజకీయాల పట్ల మోజును తగ్గించాలి. లక్ష్యాల్ని సాధించుకోవటానికి, గుర్తింపు పొందటానికి రాజకీయాలకు బయట మార్గాల్ని సృష్టించాలి. ఇందుకోసం మనం ఇంకా ఎంతో చేయాల్సుంది. రాజకీయాధికారమంటే చట్టాలు, విధానాలు, వాటి అమలు తప్ప, జీవితం, సమాజంలోని అన్ని అంశాల్నీ నియంత్రించటం కాదని స్పష్టంగా గుర్తించాలి; అలాంటి వ్యవస్థను నిర్మించాలి. మనం రాజకీయాలకి ఇంగితజ్ఞానాన్ని, లక్ష్యాన్ని, సూత్రబద్ధతను పునరుద్ధరించటం ఈవేళ ఎంతో అవసరం.

# తెలంగాణ కచ్చితంగా ఈ విషయంలో జాగ్రత్త వహించాలి

## అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జేపీ స్పందన






మన ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా, ఎన్నికల వెనకాల ఎన్ని తతంగాలున్నా, ఓట్ల కొనుగోలు, ప్రధానంగా తాయిలాల మీద ఆధారపడుతున్నా, కులం, మతం, వర్గం పేరుతో సమాజాన్ని విభజన చేస్తున్నా, ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. పోలింగ్ బూత్ లోపల స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఎవరూ బలవంతంగా ఓటేశారనటానికి ఆధారాలు లేవు. నిష్పాక్షికంగా, నిజాయతీగా, పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరుగుతోంది, ఎన్నికల ఫలితాలను ఎవరూ వ్యతిరేకించటం లేదు. ఎన్నికైన ప్రభుత్వాన్ని స్వాగతిస్తాం, ఎన్నిక కానివాళ్లు ప్రతిపక్షంలో కూర్చుంటారు. ఇది చాలా సంతోషకర పరిణామం. మరోసారి ప్రజాస్వామ్యంలోని ఉదాత్తతని తెలంగాణ ఎన్నికలు రుజువు చేశాయి. పార్టీలకి, పదవుల్లో ఉన్నవాళ్లకి, అధికారంలో ఉన్నవారికి ఎన్నికలు అనే భయం లేకపోతే, ఈ ప్రజాస్వామ్యం చాలా గందరగోళమైపోయేది. కాబట్టి మరోసారి ఓటరు నెగ్గారు.

తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు చూస్తుంటే, కొంత పరిణతి కనిపిస్తోంది. నిర్దిష్టమైన ఎజెండాలోని అంశాలే కాకుండా ప్రధానంగా కనిపించిన అంశం, ఒక వ్యక్తి చుట్టూ తిరిగే, ఒక కుటుంబం చుట్టూ కేంద్రీకరించిన నాయకత్వం స్థానంలో, విస్తృతమైన నాయకత్వ స్థానాల్ని ప్రజలు కోరుకోవటం. అన్ని రాష్ట్రాల్లో అదే తీరు కనిపించింది. అన్ని వర్గాల నుంచి నిజమైన నాయకత్వం రావాలని, ఎవరో పైనుంచి పెట్టిన నాయకత్వం కాకూడదని, అన్ని వర్గాల నుంచి సహజంగా ఎదిగే నాయకత్వం, అన్ని వర్గాలకీ ప్రాతినిధ్యం ఇచ్చేది, అలాగే రాచరిక స్వభావం కాకుండా అందరికీ అందుబాటులో ఉండేటువంటి నాయకత్వం కావాలని, ఎన్నిక కాని ప్రతినిధులు, ఎన్నికైన నాయకులు అలాంటివారే కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అదేవిధంగా, కర్ణాటక చూసిన తర్వాత ఈ ఎన్నికలు కూడా సంక్షేమం వర్సెస్ అభివృద్ధిగా జరుగుతాయని భయం కలిగింది చాలామందికి. కానీ ఈ ఎన్నికల్లో చాలా ప్రస్ఫుటంగా ప్రజలు సంకేతం ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధి మధ్య పోరాటం కాదు, రెంటికీ మధ్య సమతూకం కావాలని. కర్ణాటక చూశాక అభివృద్ధి అక్కర్లేదు, సంక్షేమానికి ఓట్లు పడతాయి, సంక్షేమమే మార్గమనుకుని కొన్ని రాష్ట్రాల్లో కొన్ని ప్రధాన పార్టీలు ఆ తప్పిదానికి ఒడిగట్టాయి. దానికి ఆ పార్టీలు మూల్యం చెల్లించాయి. అంతకంటే ముందు ఈ దేశం ఒక సంకేతాన్నిచ్చింది. పేదరికం భారం నుంచి బయటపడటానికి సామాన్య ప్రజలకి తాత్కాలిక సంక్షేమం కావాలి, కానీ నిజంగా కావలసింది దీర్ఘకాలిక అభివృద్ధి, ఎదిగే అవకాశాలు, ఆదాయాలు పెరగటం, ఉపాధి కల్పన అని. సంతోషించాల్సిన మరో విషయం – తీర్పులు చాలా స్పష్టంగా ఉన్నాయి. మళ్లీ మీరు బస్సులు పెట్టి, క్యాంపులు పెట్టి, ఆకర్ష వికర్ష పథకాలు పెట్టి, వాళ్లని వీళ్లు కొని, వీళ్లను వాళ్లు కొని ఈ గొడవలు లేకుండా తీర్పు ఉంది. తెలంగాణలో కాంగ్రెస్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో బీజేపీకి ప్రజలు స్పష్టంగా తీర్పునిచ్చారు. ఎన్నిక తర్వాత బేరసారాలు, రాజకీయ వ్యూహాలు, కొనుగోళ్లకి అవకాశం లేకుండా చేశారు.

తెలంగాణలో ఎన్నికైన ప్రతినిధుల్ని, కాంగ్రెస్ పార్టీని అభినందిస్తున్నాను. ఎన్నికల్లో ఓటమి, విజయం అనేది లేదు నా దృష్టిలో. ప్రజలకు ప్రాతినిధ్యం కోసం ముళ్లకిరీటానికి బాధ్యత స్వీకరిస్తున్నారు ఎన్నికైన ప్రతివాళ్లూ. ఏ పార్టీ అయినా ప్రతిపక్షంలో కూర్చోవచ్చు, అధికార పక్షంలో కూర్చోవచ్చు. కాబట్టి విజయాట్టహాసం ఎవరికీ ఉండాల్సిన అవసరం లేదు. అలాగే ఓడిపోయాం, కొంప మునిగిపోయిందనే భావం అక్కర్లేదు. అది పరిణతి చెందిన ప్రజాస్వామ్యం కాదు. కాబట్టి బలమైన ప్రతిపక్షం పనిచేయాలి. హుందాగా పరిపాలన నడవాలి. అందరినీ కలుపుకొని పోవాలి. కానీ తెలంగాణలో కచ్చితంగా ఒక విషయంలో జాగ్రత్త వహించాలి.

అంకెల్ని చూస్తే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలే దాదాపు 70,000

కోట్ల రూపాయలు సంవత్సరానికి అదనంగా ఖర్చు కనిపిస్తోంది. మందిహితం కోసం, మౌలిక సదుపాయాల కోసం, మిగతా రంగాల కోసం కాకుండా కేవలం తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలకు అదనంగా 70 వేల కోట్లు. ఇప్పటికే 50 వేల కోట్ల పైచిలుకు ఖర్చవుతోంది. అది కూడా రుణమాఫీ లెక్కేయలా. రుణమాఫీ లెక్కేస్తే బహుశా రూ.2,70,000 కోట్లు వ్యవసాయ రుణాలున్నాయి. దాన్లో 20%, అంటే రూ.50,000 కోట్లు కావచ్చు. అంటే అయిదేళ్లలో అమలు చేసినా ఏడాదికి రూ.10 వేల కోట్లు. ఈ 70 వేల కోట్లు కాకుండా, పెద్దగా ఆలోచించకుండా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం. ఆనాడే కేసీఆర్‌కి పిలుపునిచ్చా. హుజూరాబాద్‌లో అమలు చేసినా ఉప ఎన్నికలో ప్రజలు కూడా ఆ పథకాన్ని తిరస్కరించారు. కాబట్టి దళితులకి మేలు చేద్దాం, కానీ ఇతర రూపాల్లో చేద్దాం. మంచి విద్య గ్యారంటీగా అందించే ఏర్పాటు చేద్దాం, ఉచిత విద్య పేరుతో ఉత్తుత్తి విద్య కాకుండా పనికొచ్చే విద్య, నైపుణ్యాలు పెంచే విద్య అందిద్దాం, మంచి ఆరోగ్యం ఇచ్చే ఏర్పాటు చేద్దాం. మౌలిక సదుపాయాలు పెంచుదాం దళితులకి. వాళ్ల గృహనిర్మాణం చేద్దాం. ఇతర పద్ధతుల్ని పాటిద్దాం. వాళ్లకి శిక్షణనిచ్చి నైపుణ్యాన్ని పెంచుదాం. ఉపాధి కల్పన చేద్దాం, అంతేగానీ, ఈ డబ్బు ఇలా పందేరం చేయటం సరైనది కాదని స్పష్టంగా చెప్పాను. కాంగ్రెస్ పార్టీ కూడా అనాలోచితంగా దాన్ని కొనసాగిస్తామని, దళితబంధు 10 లక్షల్ని 12 లక్షలు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ఒక్క హామీకీ బహుశా రూ.2,40,000 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అంటే ఏడాదికి రూ.40-50 వేల కోట్లు. ఈ మొత్తం కలిపితే రూ. 1,20,000 నుంచి 1,30,000 కోట్లు అదనంగా ఖర్చు పెట్టటానికి కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఇది తెలంగాణ రాష్ట్రానికి, ప్రభుత్వానికి ఉరి తాడవుతుంది. ముందే హెచ్చరిస్తున్నా, జరిగిందేదో జరిగిపోయింది. వీటిలో ఆచరణసాధ్యమైనవి, పనికొచ్చేవి తిరిగి అమలు చేయండి. అసాధ్యమైనవి ప్రజల ముందు నిజాయతీగా చెప్పి పక్కనపెట్టండి. ఎందుకంటే, 2022-23 సవరించిన లెక్కల ప్రకారం, 1,72,000 కోట్లు రెవెన్యూ వ్యయం. అంటే రోజువారీ ఖర్చు. దాదాపు వచ్చిన ఆదాయం, పెట్టే ఖర్చు సరిపోతోంది. రెవెన్యూ, దానిపై అదనంగా రూ.1,20,000 - 1,30,000 కోట్లు ఖర్చు పెట్టాలంటే తల్లకిందులుగా తపస్సు చేసినా ఆదాయం లేదు. అప్పు చేసి ఈ రకంగా ఖర్చు పెట్టాలంటే భవిష్యత్తుని మీరు స్వయంగా అంధకారం చేస్తున్నారు. ఈ మాట ఎన్నికైన రోజునే హెచ్చరిస్తున్నాను. తర్వాత చెప్పటం అనవసరం. ఇప్పుడు ఎన్నికైన తర్వాత తొందరపాటు లేకుండా చాలా జాగ్రత్తగా, నింపాదిగా ప్రజల దృష్ట్యా, రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్తు దృష్ట్యా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. కచ్చితంగా సంక్షేమం అవసరం. కానీ సంక్షేమమే పాలన, అభివృద్ధి వద్దు అనుకుంటే, అది కాదు ప్రజలిచ్చిన సంకేతం. ఈ దేశంలో ప్రజలకు సంక్షేమం కావాలి, అభివృద్ధి కావాలి. అభివృద్ధిని నాశనం చేసి సంక్షేమమే అనుకుంటే, రాష్ట్ర భవిష్యత్తు అధోగతే. ఆ పార్టీకీ భవిష్యత్తులో అరణ్యరోదన మిగులుతుంది.

చివరిగా, మూడు శాతం ప్రభుత్వోద్యోగులను సంతృప్తిపరిచి ప్రజలకు సంక్షేమం లాగా నటించి దేశాన్ని అరిష్టంపాలు చేయటం ఈ మధ్యకాలంలో ఒక ఫ్యాషనైపోయింది. రాష్ట్రం తర్వాత రాష్ట్రంలో ఇలా జరుగుతోంది. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అదృష్టవశాత్తూ కొంత విజ్ఞత ప్రదర్శించి ఇప్పటి వరకూ అమలు చేయలేదు. తెలంగాణలో హామీ ఇచ్చారు, కానీ ప్రజలు దానికి ఓటు వేయలేదు. కాబట్టి ఓపీఎస్ వల్ల గెలుస్తామనే పిచ్చి ఆలోచన పక్కన పెట్టండి. ప్రజల సంక్షేమం నిజంగా కోరుకుంటే కష్టంలో ఉన్నవాళ్లు, నష్టపోతున్నవాళ్లు, దగాపడుతున్నవాళ్లు, పేదరికంలో కూరుకుపోతున్నవాళ్లు, ఆ 97%లో ఉన్నారుగానీ, మూడు శాతం ప్రభుత్వోద్యోగుల్లో లేరు. ప్రభుత్వోద్యోగులకు పెన్షన్ రావాలి, కానీ పాత పద్ధతి కాదు. ప్రతి నెలా ప్రభుత్వం, ఉద్యోగులు కొంత డబ్బు పెట్టి, దాన్నుంచి పెన్షన్ రావాలి. దాన్లో ఏమైనా కొరతలుంటే మార్పులు చేర్పులు చేసుకుందాం. కనీస భరోసా ఉండేట్లుగా ఏర్పాట్లు, ఎవరన్నా మరణిస్తే ఇన్సూరెన్స్ ఏర్పాటు కష్టం కాదు. అంతేగానీ ఎన్నికల్లో భయంతో, ఎట్లాగొట్లా గెలవాలనే కోర్కెతో, రాష్ట్ర, దేశ భవిష్యత్తుని పూర్తిగా నాశనం చేసే విధానాలకి తిలోదకాలివ్వాలి. లేకపోతే పచ్చగా ఉన్న తెలంగాణ రాష్ట్రం నష్టపోతుంది. పరిపాలనలో లోపాలున్నాయి, కచ్చితంగా ఉన్నాయి, అధికార కేంద్రీకరణ, అవినీతి కావచ్చు, ఆశ్రిత పక్షపాతం, అహంకారం కావచ్చు, కానీ పచ్చగా ఉన్న రాష్ట్రాన్ని ఆర్థికంగా మనంత మనం మన వేళ్లతో మన కళ్లు పొడుచుకున్నట్లవుతుంది. పార్టీలు ఏవైనా కావచ్చు, పార్టీలు ఇవాళ వస్తాయి, రేపు పోతాయి, కానీ ప్రజల భవిష్యత్తు, యువత భవిష్యత్తు, వారి ఉపాధి కల్పన, పేదరిక నుంచి బయటపడటం ముఖ్యం. పేదలకు సాయం చేయటం ఎంత అవసరమో, అంతకంటే ఎక్కువ అవసరం పేదరికాన్ని తొలగించేందుకు, ఆదాయాన్ని పెంచేందుకు, ఆర్థికంగా అభివృద్ధిని సాధించటం. అదొకటే దీర్ఘకాలంలో ఒక దేశ ప్రగతికి, ఒక రాష్ట్ర ప్రగతికి, ప్రజల భవిష్యత్తుకి మార్గం. దాన్ని గుర్తుంచుకుంటారని ఆశిస్తూ, ఎన్నికైన ప్రతినిధులని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని, అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రతినిధుల్ని, ప్రభుత్వాల్ని ఏర్పాటు చేస్తున్న బీజేపీని మనసారా అభినందిస్తూ, ఎన్నికలైపోయాయి కాబట్టి పార్టీల్ని పక్కనపెట్టండి, పక్షపాతం లేకుండా నిజాయతీ అయిన పాలన అందించండి, అధికారాన్ని వికేంద్రీకరించండి, చట్టబద్ధపాలన తీసుకురండి, అవినీతి అంతమొందించండి, సంక్షేమానికి, అభివృద్ధికి సమతూకం పాటించండి, దీర్ఘకాల భవిష్యత్తు కోసం బాటలు వేయండి. ఆ ప్రయత్నం చేస్తారని, అలాంటి ప్రయత్నానికి పార్టీలకతీతంగా అన్ని వర్గాలూ కలిసి మద్దతిస్తాయని ఆశిస్తున్నా.

# ప్రజల తీర్పు చెబుతున్న పాఠాలు

మన దేశంలో రాజకీయ పార్టీలు మౌలికమైన విషయాల మీద ఆలోచించటం అరుదు. దేశంలో వచ్చిన పెద్దమార్పుల్లో చాలామేర విధిలేని పరిస్థితుల్లో లేదా యాదృచ్ఛికంగా వచ్చినవే. ఇటీవల ఆ కొద్దిపాటి ఆలోచనను కూడా పార్టీలు పక్కనపెట్టేశాయి. బ్రాండ్ ఇమేజ్, ఈవెంట్లు, పోల్ మేనేజ్‌మెంట్ వంటి పద్ధతుల్లో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

ప్రస్తుత రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తే ఆ చట్రం పరిధిలోనే చిన్న చిన్న మార్పులు మినహా మౌలికమైన మార్పు దిశగా పార్టీలు అడుగులు వేయడం లేదు. అత్యధిక స్థానాలతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ విధానాలే దీనికి ఉదాహరణ. ఆర్థిక రంగం, విదేశాంగ విధానం, కొన్ని ఇతరత్రా అంశాల్లో తప్ప రాజకీయ, పాలనా రంగాల్లో మౌలిక మార్పులు తీసుకురావడానికి జరిగిన ప్రయత్నం ఏదీ ఈ పదేళ్లలో జరగలేదు.

తెలంగాణలోనూ తనకున్న బలాల్ని, సానుకూలతల్ని విస్తరించి, సుస్థిరం చేసే సంస్కరణలను తేకుండా ప్రత్యర్థుల బలహీనతల మీద రాజకీయం చేసే పాలనకే కేసీఆర్ పరిమితం అయ్యారు. అధికారపార్టీ బలహీనపడడం ద్వారా అధికారం చేజిక్కించు కోవాలని ప్రతిపక్ష కాంగ్రెస్ ఎదురుచూసింది. అయితే కొన్ని అదనపు కారణాల వల్ల ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ విజయాన్ని దక్కించుకుంది.

తెలంగాణ ఎన్నికల తేదీ ప్రకటనకి కొంత ముందు వరకు అధికార బీఆర్ఎస్ ఆధిక్యంలో ఉంది. పలు సర్వేలు కూడా అదే సూచించాయి. కానీ ప్రతిపక్ష బలహీనత మీదే ఆధారపడిన ఉదాసీనత కేసీఆర్‌కు వాస్తవ పరిణామాల్ని మరుగునపరచింది. రెండో స్థానంలో ఉన్న కాంగ్రెస్ స్థానాన్ని అందుకునేందుకు బీజేపీ వేగంగా ఎదుగుతున్న సమయంలో కేసీఆర్ కుటుంబ సభ్యులపై మద్యం కుంభకోణం కేసు, బీజేపీ అగ్రనాయకత్వానికి సన్నిహితంగా ఉండే కొందరు నేతలు ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఇరుక్కోవటంతో ఏం జరిగిందో ఏమో రాష్ట్ర బీజేపీ సారథ్యం మారింది. ఆ పార్టీ కార్యకర్తల్లో, ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన బలమైన నేతల్లో ఉత్సాహం ఒక్కసారిగా తగ్గింది. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల నాటి వాతావరణం పలచబడి, బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయనే సంకేతం ప్రజల్లో వ్యాపించటం మొదలైంది. నిజానికి 2018లో గెలిచిన దగ్గర్నుంచే కేసీఆర్ తన కుమారుడు, మంత్రి కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయటానికి సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న బీజేపీ అగ్ర నాయకత్వంతో చేసిన సంప్రదింపులు ఫలించలేదని చెబుతారు (ఈ మాట ఇటీవల ఎన్నికల సభల్లో ప్రధాని మోదీ, యూనియన్ హోం మంత్రి అమిత్‌షా చెప్పినా కేసీఆర్ ఖండించలేదు). ఆ తర్వాత రెండు, మూడు స్థానాల్లో ఉన్న కాంగ్రెస్, బీజేపీల మధ్య ఆటను కేసీఆర్ ప్రారంభించారు. కాంగ్రెస్‌ను బలహీనపరచి, బీజేపీని పెంచే వ్యూహాన్ని అమలు చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం కూడా దూకుడుగా వ్యవహరించటంతో సంస్థాగతంగా అంతంతమాత్రంగా ఉ న్న కాంగ్రెస్ మరింత వెనక్కివెళ్లింది. మరోవంక పాలనలో మితిమీరిన సాంప్రదాయ ధోరణి, అధికార కేంద్రీకరణ, అవినీతి, పటాటోపం కేసీఆర్ పట్ల వ్యతిరేకతకు ఆజ్యం పోసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రజల్లో ఉన్న ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను మలిచేందుకు చొరవ చూపలేకపోయారు. ఆ ఉద్యమస్ఫూర్తిని రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరిచే గొప్ప అవకాశంగా వినియో గించుకోలేకపోయారు. మొదట్లో 'గ్రామజ్యోతి' వంటి పథకాలతో స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు ద్వారా రోజువారీ పాలనను అందించటం వంటి ఆలోచనలు చేశారు. కానీ క్రమంగా డబ్బు రాజకీయం వైపు మొగ్గుచూ పనారంభించారు. జేపీ లాంటి వాళ్లు హెచ్చరిస్తున్నా వినకుండా అసంబద్ధమైన కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. ఆచర ణసాధ్యంకాని ప్రాజెక్టులు, భవనాల నిర్మాణానికి, అట్టహాసాలకి దుబారా చేశారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల్లో భారీ అవినీతి జరిగిందని, ఎమ్మెల్యేల అవినీతిని ముఖ్యమంత్రే ప్రోత్సహి స్తున్నారని, అవినీతి అధికారులకు శిక్ష పడకుండా కేసీఆరే అడ్డుకుంటున్నారనే వాదనలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి.

అదేవిధంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వోద్యోగం వస్తుందన్న భ్రమ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ కల్పించారు. ఆ తర్వాతైనా ప్రజల్లో తన మాటకు అంత విలువ ఉన్నప్పుడు ప్రజలకు నచ్చచెప్పి నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు ఎక్కడికక్కడ వచ్చే ఏర్పాటు చేయటం మీద దృష్టి పెట్టలేదు. వ్యవసాయం మీద ఒక పరిధి దాటి ఆధారపడటం సాధ్యం కాదని గుర్తించకుండా, సాగునీరు ఇవ్వటం పేరుతో

అసంబద్ధ ప్రాజెక్టులు కట్టారు గానీ, అంత చేసినా, రైతుబంధు వంటివి ఇస్తున్నా సాగులో పెద్ద ఆదాయం లేక యువతలో అసంతృప్తి పెరుగుతోందన్న విషయాన్ని పాలకులు గుర్తించలేకపోయారు. పోటీ పరీక్షల పేపర్లు లీకవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవటంతోపాటు బాధ్యులపై పారదర్శకంగా చర్యలు తీసుకోలేదు. యువతకు ఉపాధి అవకాశాలపై పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాల్ని చెప్పలేదు. నమ్మినబంట్లలా వ్యవహరించే అధికారులను చుట్టూ పెట్టుకున్నారు తప్ప సమర్థంగా, సవ్యంగా వ్యవహరించే అధికారులతో సరైన వ్యవస్థని నిర్మించలేకపోయారు. మీడియా చేసే ఆ కాస్త నిర్మాణాత్మక విమర్శలు కూడా చేయకుండా గొంతు నొక్కేయటంతో వాస్తవాల్ని గుర్తించటం కొరవడింది. తెలంగాణ సెంటిమెంట్ తగ్గి వాస్తవాలు అర్థమవుతుండటంతో, కేసీఆర్ పాలనా వైఫల్యాలు, లోపాలు అన్నీ కలగలసి ఆయన ఇమేజ్‌ను మసకబార్చాయి. ఈసారి అధికారంలోకి వస్తే 'ప్రజాదర్బార్' నిర్వహిస్తామని కేటీఆర్ ప్రకటించాల్సి వచ్చిందంటే కేసీఆర్ నిజాం నవాబ్ తరహా వ్యవహారశైలి పట్ల ప్రజల్లో ఎంతటి వ్యతిరేకత వచ్చిందో, అంత అనుచరగణం ఉన్నా ఆ విషయం ఇప్పటిదాకా అధికార పార్టీ ఎంత గుర్తించలేకపోయిందో అర్థమవుతుంది. కేసీఆర్ బృందంలోని వారు కూడా రాజును మించిన రాజభక్తితో ఆయన్ను వ్యక్తిగతంగా కీర్తించటం తప్ప లోపాల్ని తెలియచెప్పే ప్రయత్నం పెద్దగా చేయలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఇచ్చిన ఖరీదైన వరుస అడ్వర్టయిజ్‌మెంట్లు ప్రజల మీద ప్రభావం చూపకపోగా ప్రతికూల భావం కలిగిస్తున్నా ప్రచార సరళిని సమీక్షించుకోలేదు. అంతెందుకు, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, కేటీఆర్ మధ్య జరిగిన ఇంటర్వ్యూ సంభాషణలో జేపీ బీఆర్ఎస్ ప్రభుత్వంలోని లోపాల్ని స్పష్టంగా చెప్పినా కూడా అవన్నీ కత్తిరించి గంటన్నరపైన వీడియోని యాభై నిముషాల వీడియోగా విడుదల చేశారు. పరిపాలనలో అన్ని లోపాలున్నా, ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికాభివృద్ధిని పరిరక్షించటంలో, ఓపీఎస్ హామీ ఇవ్వకుండా జాగ్రత్త పాటించటం రీత్యా బీఆర్ఎస్ ఎందుకు కీలకం, ఎన్నికలయ్యాక విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి లోపాల్ని ఎలా సరిదిద్దుకోవాలి అని జేపీ తెలియచేశారు. ఆ దృక్పథం, ఆ అంశాలు నామమాత్రమై కేటీఆర్‌ను జేపీ ఏకపక్షంగా పొగిడారన్నట్లుగా వీడియో తయారవటంతో బీఆర్ఎస్‌కు నష్టం జరగ్గా, జేపీ ఆలోచనల్ని అనుసరించేవారిలో కొందరికి అసంతృప్తి కలిగింది. అయితే ప్రజాజీవితంలో జేపీ యాభై ఏళ్ల ట్రాక్‌రికార్డు తెలుసు కాబట్టి, దేశం, ప్రజాప్రయోజనాలు తప్ప మరోటి ఆయన ఆలోచించరు కాబట్టి వారిలో దాదాపు అందరూ సంయమనం పాటించి సానుకూలంగా రిసీవ్ చేసుకున్నారు.

మన ప్రజాస్వామ్యం ఇంకా పరిణతిస్థాయిలో లేకపోవటం, రెండో స్థానం కోసం బీజేపీతో కొట్లాడుతున్న కాంగ్రెస్ ఉచితాలు, సోషల్ మీడియా ప్రచారం, కేవలం తన కుటుంబం కోసం బీజేపీతో కేసీఆర్ కుమ్మక్కయ్యారని ప్రజల్లో ఏర్పడిన అభిప్రాయం వంటివి కలగలసి బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకతను ఉద్వేగస్థాయికి పెంచాయి. కేసీఆర్ ప్రజలతో సంభాషణను మరచిపోగా, కాంగ్రెస్ వారు దాన్నో అవకాశంగా ఉపయోగించుకుని నిరుద్యోగ యువత, అల్పాదాయ వర్గాల్లోకి వ్యతిరేక ప్రచారాన్ని విస్తృతంగా తీసుకెళ్లి తాయిలాల్ని ఆశగా చూపింది.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన తాత్కాలిక తాయిలాల వ్యూహం ఫలించి అక్కడ విజయం సాధించటంతో అంతకుమించి మించి హామీల్ని కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ప్రకటించింది. ఒక అంచనా ప్రకారం, కాంగ్రెస్ ప్రకటించిన హామీల అమలుకు ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న రూ. 52,000 కోట్ల కంటే సుమారు మరో 70,000 కోట్లు ఏటా అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇవి కాక వ్యవసాయ రుణమాఫీ, ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున పది లక్షల ఇళ్ల నిర్మాణం కోసం మరో రూ. 88 వేల కోట్లు. తాత్కాలిక పథకాలు మితిమీరితే ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వనరులూ ఉన్నా ఆర్థిక పరిస్థితి ఏమైందో చూస్తున్నాం. అక్కడి కంటే భారీస్థాయిలో తెలంగాణలో సంక్షేమం పేరుతో వ్యక్తిగత పథకాలను ప్రకటించారు. ప్రభుత్వోద్యోగుల పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను తిరిగి తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇవన్నీ లెక్కేస్తే హైదరాబాద్ వంటి పెద్ద నగరం ఉన్న చిన్న రాష్ట్రం కావటంతో మహానగర ఆదాయం వల్ల సంపన్న రాష్ట్రంగా గుర్తింపు పొందిన తెలంగాణ కుంగిపోతుందని చెప్పటానికి పెద్ద లెక్కలు అక్కర్లేదు. అమెరికా వంటి సంపన్న దేశాల్లో కూడా ప్రజలు తాత్కాలిక తాయిలాల్ని కోరుకుంటున్నారుగానీ, అక్కడ ప్రభుత్వం చేయాల్సిన పనుల్ని వదిలేసి తాయిలాలు ఇస్తామంటే ప్రజలు ఊరుకోరు. ప్రభుత్వోద్యోగులను మెప్పించటానికి ఓపీఎస్ వంటి స్కీముల్ని తెస్తే మిగతా ప్రజానీకం సహించరు. కానీ మన దేశంలో ఓటుకి, జీవితానికి మధ్య సంబంధం లేకుండా ఓటు ఎందుకు వేస్తున్నామో ప్రజలకు అర్థంకాని వ్యవస్థను నిర్మించి దాన్ని సరిదిద్దకుండా ఆ విషవలయంలో పార్టీలు కూరుకుపోవటంతో ప్రజలు ఆరోగ్యం, విద్య, చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ, మౌలిక సదుపాయాలు వంటి అంశాలు ప్రభుత్వ బాధ్యత అని గుర్తించి వాటి కోసం డిమాండ్ చేయకుండా, ఓటు అంటే డబ్బు, మద్యం, తాత్కాలిక తాయిలాలు, జిందాబాద్,

# కోపంతో, కసితో ఓటు వేయవద్దని జేపీ అప్పీల్

**ఎన్నికల్లో ఓటు విషయంలో ఎప్పుడూ కోపం, కసి పనికిరావు. అందుకే ఆలోచించి ఓటు వేయాలని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో జేపీ అనేక సందర్భాల్లో విజ్ఞప్తి చేశారు. డబ్బుతో ఓట్లు కొనటం, చట్టాన్ని దుర్వినియోగం చేయటం, అధికారాన్ని కేంద్రీకరించటం, అవినీతి వంటి వాటిల్లో అన్ని పార్టీలూ ఒకేలా ఉన్నప్పుడు, వాటిల్లో మార్పు తేవాలనే ఆలోచన ఏ ఒక్క పార్టీలోనూ కనిపించనప్పుడు ఒకే ఒక్క ఆశాకిరణం ఆర్థికాభివృద్ధి అని, అందువల్ల ఏ పార్టీ ఆర్థికాభివృద్ధికి, మౌలిక వసతులు, పారిశ్రామికీకరణకి, ఉద్యోగ అవకాశాలు, ఆదాయాలకి దోహదం చేస్తుందో, భవిష్యత్తును పరిరక్షిస్తుందో ఆ పార్టీకి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. ఉద్వేగాలు, తాత్కాలిక తాయిలాలు కాకుండా యువత తమ అభివృద్ధి కోసం ఆలోచించాలని జేపీ చేసిన విజ్ఞప్తికి పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా హైదరాబాద్‌లో మంచి స్పందన కనిపించిందని ఓటింగ్ సరళిని బట్టి అర్థమవుతుంది.**

ముర్దాబాద్‌లు అనుకుంటూ తమకున్న అవకాశాల్ని అందుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వ్యవహారశైలి అధికారమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తాత్కాలిక తాయిలాల ప్రకటనలు కలిసొచ్చాయి. ప్రజలకు దూరమవటం, అవినీతిపరులని తాను స్వయంగా పేర్కొన్న ఎమ్మెల్యేలకు కూడా మళ్లీ టికెట్లివటం వంటి కేసీఆర్ వ్యవహారశైలి వల్ల వారు మరింత తేలిగ్గా తమ అభిప్రాయాల్ని ప్రజల్లో జొప్పించగలిగారు.

ఉత్తరాదిన కీలక రాష్ట్రాల్లో బీజేపీ ఘనవిజయం సాధించినా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి కూడా పాఠం ఉంది. కాంగ్రెస్ సంస్కృతి ఇప్పటికే బీజేపీలోకి ప్రవేశించింది. తెలంగాణలో కేసీఆర్ తరహాలోనే జాతీయ స్థాయిలో కొన్ని అంశాల్లో మోదీ కూడా వ్యవహరిస్తున్నారు. మోదీ కలల బేహారి. కలల్ని అమ్మటం రాజకీయాల్లోనే కాదు ఏ రంగంలోనైనా అవసరం. కానీ ఎప్పటికప్పుడు ఆచరణసాధ్య కలల్ని నెరవేర్చకుండా కొత్త కలల్ని అమ్ముతుంటే ప్రజల్లో వెగటు కలుగుతుంది. ప్రజలు ఆయన మీద ఏ రకమైన ఆకాంక్షలతో అత్యధిక స్థానాలతో గెలిపించారో అందుకవసరమైన మార్పుల్ని ఆయన ఎప్పటికప్పుడు తేకపోవటం, రాజకీయ, పాలనా సంస్కరణలు కొరవడటం వల్ల 2014 మోదీ ముందు 2023 మోదీ వెలవెలబోతున్నారు. ఇప్పటికీ ప్రజాదరణ ఉన్నా.. ప్రత్యర్థుల బలహీనతల మీదే ఆయన బలం ఎక్కువగా ఆధారపడి ఉంది. ప్రజాజీవితంలో ఏకపక్షంగా వ్యవహరిస్తే, ప్రజలు ప్రభువులనే విషయాన్ని చేతల్లో మర్చిపోయి డిఫాల్ట్ ధోరణితో వ్యవహరిస్తే ఏమవుతుందో తెలంగాణ నుంచి పాఠాల్ని నిజాయతీగా నేర్చుకుంటే దీర్ఘకాలంలో కూడా మోదీకి, ఆయన పార్టీకి ప్రయోజనకరం. లేదంటే రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం.

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ రాలేదు, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్‌కు తక్కువ సీట్లు రాలేదు. భేషజాలకు పోకుండా ఆలోచిస్తే తమ సామర్థ్యాన్ని, ప్రజల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవటానికి రెండు పక్షాలకీ ఇది సరైన అవకాశం. ప్రతిపక్షాల మాట ఆలకించి కాంగ్రెస్ పార్టీ సమర్థ పాలన అందిస్తుందని, ప్రజల తీర్పులోని పాఠాల్ని గుర్తించి బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని ఆశిద్దాం.

ఓపీఎస్ వంటి హామీలపై కాంగ్రెస్ వెనక్కి తగ్గాలి. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించాలి. ఎన్నికల ప్రచార సమయంలో ఓపీఎస్‌పై హామీ ఇచ్చినా, ఆ తర్వాత దాని వల్ల ప్రమాదాన్ని గుర్తించి ఏపీ సీఎం వైఎస్ జగన్ మధ్యేమార్గంగా జీపీఎస్ తీసుకొచ్చారు. ఓపీఎస్ ఎన్నికలను ప్రభావితం చేసే అంశం కాదని, ఈ ఎన్నికల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. తెలంగాణలో కూడా ప్రజల ఓటింగ్‌ను ఆ అంశం ప్రభావితం చేయలేదు. కాబట్టి ఓపీఎస్ వంటి హామీలతో గెలుస్తామనే భ్రమ నుంచి పార్టీలు బయటపడి అటువంటి అంశాలను ఎన్నికల ఎజెండా నుంచి దూరంగా ఉంచాలి. రోజువారీ ఖర్చులకు అప్పు చేయకుండా, అప్పు తెచ్చిన డబ్బులు పప్పుకూడు కోసం కాకుండా కేవలం భవిష్యత్ తరాలకు పెట్టుబడిగా మాత్రమే ఉపయోగించేలా ఎఫ్ఆర్‌బీఎం తరహాలో నిబంధనలు అమలు చేయాలి.

తెలుగు రాష్ట్రాలకు, దేశానికి తాత్కాలిక సంక్షేమ పథకాలు, అభివృద్ధి మధ్య సమతూకం, ఆర్థిక క్రమశిక్షణ, పాలన, రాజకీయ సంస్కరణలు అవసరమని, రెండున్నర శాతం ఓట్లు తక్కువ వస్తే పార్టీలు పెద్ద సంఖ్యలో సీట్లు కోల్పోవాల్సిన పరిస్థితి లేకుండా ఎన్నికల సంస్కరణలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వం మధ్య స్పష్టమైన అధికారాల విభజన, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎంతో కీలకమని తెలంగాణ ఎన్నికలు స్పష్టంగా తెలియచేస్తున్నాయి.

# బి.సి గణన వల్ల నిజంగా ఉపయోగముందా?

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-




వెనుకబడిన తరగతుల (బి.సి) జనాభా గణనను పలు పార్టీలు ఎన్నికల్లో పెద్ద ప్రచారాస్త్రంగా మారుస్తున్నాయి. శత్రుదేశాల మధ్య యుద్ధంలా, అట్టహాసంగా జరిగే మన ఎన్నికల ప్రచారాల్లో అలాంటి సారంలేని నినాదాలు, వెలుతురు లేని వేడి, స్పష్టత లేని వాగాడంబరత మామూలైపోయాయి.

ఒక్క విషయమైతే సుస్పష్టం: కులం ప్రాతిపదికన జనాభా లెక్కలు ఉన్నత విద్య, ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లపై ఎటువంటి ప్రభావం చూపవు. సమాజంలోని అణగారిన వర్గాలకు అవకాశం అందించేందుకు మనకు ఇప్పటికే పటిష్ఠ విధానాలున్నాయి. రిజర్వేషన్లపై అన్ని పార్టీల మధ్యా అభినందనీయ ఏకాభిప్రాయం ఉంది. నిజానికి, రాజ్యాంగానికి ఇప్పటి వరకు చేసిన 106 సవరణల్లో 29 (27%) సమాజంలోని అణగారినవర్గాలకు అనుకూలంగా రిజర్వేషన్లకు సంబంధించినవే. దేశమంతా షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్.టి), వెనుకబడిన తరగతులకు (బి.సి) ఉన్నత విద్య సీట్లలో, ప్రభుత్వ ఉద్యోగాలలో, వివిధ అంచెల్లోని ప్రజాప్రాతినిధ్య స్థానాల్లో కోటాలున్నాయి. వివక్షను నిర్మూలించి అందరికీ సమానావకాశాలను అందించే విధానాల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య సీట్లలో సమాజంలోని వివిధ వర్గాలకు 50% వరకు రిజర్వు చేయవచ్చని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా గీత గీసింది, బి.సి గణన వల్ల ఇందులో ఏమీ తేడా ఏర్పడదు.

రాజకీయ రిజర్వేషన్లకు సంబంధించి, ఎస్.సి, ఎస్.టి లకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వు చేసిన సీట్లు మొదట్నుంచీ ఉన్నాయి. నిజానికి స్థానిక ప్రభుత్వాల్లోని ఎన్నికైన ప్రజాప్రాతినిధ్య స్థానాల్లో ఎస్.సి, ఎస్.టి, బి.సి లు, మహిళలకు 75% దాకా రిజర్వేషన్లు ఉన్నాయి. అక్కడ బి.సిలకు ఇప్పటికే రిజర్వేషన్ ఉన్నా ఏ పార్టీ, ప్రభుత్వం (కేరళ మినహాయించి) స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చేందుకు ఏమాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించలేదు. చాలా సందర్భాల్లో స్థానిక ప్రభుత్వాలు ఉత్సవ విగ్రహాలు, నామమాత్రం: వాటికి తగినన్ని వనరులుండవు, నిధుల బదిలీ ఉండదు; రాజ్యాంగంలోని 11, 12 షెడ్యూళ్లలో పొందుపరచిన అంశాలకు సంబంధించి స్థానిక ప్రభుత్వాలకు నిర్ణయాధికారాలుగానీ, స్థానిక అధికారులపై నియంత్రణ గానీ ఉండవు. సమాజంలోని అణగారిన వర్గాలకు రాజకీయ సాధికారత కల్పించటం గురించి పార్టీలు పైకి కబుర్లు చెబుతున్నాయి తప్ప చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదనటానికి ఇంతకంటే నిదర్శనం అక్కర్లేదు.

రాష్ట్ర అసెంబ్లీలు, లోక్‌సభ విషయానికొస్తే, పార్టీలు బి.సిలకు ఉన్నకొద్దీ ప్రాతినిధ్యాన్ని పెంచుతున్నాయి. దేశానికి స్వతంత్రం వచ్చాక తొలినాళ్లలో ఎస్.సి, ఎస్.టిలకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు మినహాయించి చట్టసభలు చాలామేర అగ్రవర్ణాలుగా పిలవబడేవారి, లేదా ఇతర కులాల (ఓ.సి) గుత్తసొత్తులా ఉండేవి. ఆ తర్వాతి కాలంలో వయోజన ఓటు హక్కు కారణంగా వివిధ వర్గాలని ఆకట్టుకోవటం పార్టీలకి అనివార్యమయింది. కాబట్టి సమాజంలో ఉన్న వైవిధ్యం, అణగారిన వర్గాల ప్రజల ఆకాంక్షలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం అన్ని వర్గాలలో తలెత్తిన ఉద్యమాలు కాలక్రమేణా ఎన్నికల రాజకీయాల మీద ప్రభావం చూపనారంభించాయి. పార్టీలు బి.సిల నుంచి నాయకత్వాన్ని పెంచటం, వారికి అవకాశాలనివ్వటం ప్రారంభించాయి. ఈవేళ దేశవ్యాప్తంగా అనేక పెద్ద రాష్ట్రాలలో బి.సి నాయకులు రాజకీయాల్లో బలమైన శక్తులుగా ఎదిగారు. సాక్షాత్తూ ప్రధానమంత్రి బి.సిల నుంచి ఎదిగిన విశ్వసనీయ నాయకుడు. బి.సి నాయకులు, ప్రతినిధులు మన ఎన్నికల ప్రక్రియలో, ప్రాతినిధ్యంలో ప్రాధాన్యతను పొందటం మనందరం గర్వించాల్సిన విషయం. ప్రజాస్వామిక భాగస్వామ్యంలో మన విజయానికి ఇది సంకేతం.

విద్యలో, ఉద్యోగాలలో బి.సి గణన ప్రభావం లేనప్పుడు, బి.సి నాయకత్వం సహజ ప్రజాస్వామిక పద్ధతుల్లో ఎదుగుతున్నప్పుడు, బి.సి గణన వల్ల ఒరిగేదేమిటి? వెనుకబడిన వర్గాలకు ఏదో



చేస్తున్నామన్న భావం కలిగించి రాజకీయంగా ప్రజల్ని సమీకరించేందుకు వేసే ఎత్తుగడ తప్ప వేరేమీ కాదు. కానీ దీనివల్ల ప్రతికూల పరిణామాలకు మాత్రం కచ్చితంగా అవకాశం ఉంది.

మన దేశంలో రాజకీయ పోటీ తీవ్రంగా ఉంది, స్వేచ్ఛలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరుగుతున్నాయి, ఎన్నికైన ప్రభుత్వాలకి నిజమైన అధికారాలున్నాయి. అంటే, మనకు ఒక పటిష్ఠమైన, పనిచేసే ప్రజాస్వామ్యం ఉంది. అదేసమయంలో, చాలా తీవ్రమైన లోపాలు కూడా ఉన్నాయి: రాజకీయాల్లో చట్టవిరుద్ధమైన డబ్బు విపరీతమైంది. ఉమ్మడి అవసరాలు, ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలని పణంగా పెట్టి వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమం మీద మాత్రమే పార్టీలు తరచూ ఆధారపడుతున్నాయి; తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం కులం, ప్రాంతం, మతం పేరుతో సమాజాన్ని వికృతంగా ముక్కలు చేస్తున్నారు; చట్టబద్ధపాలన కాగితాల్లో తప్ప మాటల్లో కూడా లేదు, బడితె ఉన్నవాడిదే బర్రె చందాన ఆటవికన్యాయం అమలవుతోంది; పోలీస్ స్టేషన్ల బయట కండబలంతో బందన్యాయం రాజ్యమేలుతోంది; పార్టీలు నియంతృత్వంగా మారాయి. సభ్యులు, నేతలు పూర్తిగా హైకమాండ్ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి వస్తోంది; ప్రభుత్వ సేవలు అధ్వాన్నంగా ఉన్నాయి; అవినీతి బారిన పడనివారు లేరు, అవినీతి లేని రంగం లేదు.

ఈ నేపథ్యంలో బి.సి గణన వల్ల చెప్పుకోదగిన ప్రయోజనాలంటూ ఏమీ ఉండవు. కనీసం రాజకీయ సంస్కృతిని, ప్రజాస్వామ్యాన్ని కూడా మెరుగుపరచలేదు. దీనివల్ల ఒకే ఒక్క ఫలితం కనిపిస్తోంది: ఇప్పటికే ముక్కలైన సమాజంలో, బి.సి గణన కుల స్పృహను మరింత పెంచుతుంది. కులం, యాదృచ్ఛిక పుట్టుక విధించిన వైకల్యాల్ని తొలగించకపోగా కుల ఉన్మాదాన్ని తీవ్రతరం చేస్తుంది. రాజకీయ సమీకరణ కోసం కేవలం కులం మీద ఆధారపడటం వికృత పోకడ. ప్రతి బిడ్డకూ అవకాశాల్ని పెంపొందించటంలో, పౌరులందరికీ స్వేచ్ఛలను విస్తరించటంలో మన రాజకీయ ప్రక్రియ ఘోర వైఫల్యానికి అటువంటి ఎత్తుగడలు అద్దం పడుతున్నాయి. మన పాలనలో ఇన్ని కీలక వైఫల్యాలు ఇంత ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే, కొన్ని వర్గాల అస్తిత్వం చుట్టూ రాజకీయాన్ని తిప్పటం తిరోగమన చర్య. ఆధునికత, ప్రగతి అంటే వ్యక్తిగత అభివృద్ధిని, ఉమ్మడి ప్రయోజనాన్ని సంధానం చేయటం తప్ప పౌరుల జీవితాల్ని నరకం చేస్తూ కొన్ని వర్గాల అస్తిత్వాల్ని ప్రోత్సహించటం కాదు. కులం భారతీయ సమాజానికి ఒక శాపం. పుట్టుకను బట్టి ప్రజల్ని నిలువునా విభజించటం ఏ సమాజానికైనా అవమానకరం. పుట్టుకతో అసమానత మామూలే అనుకునే నైతిక ఆత్మవంచన ఆరోగ్యకర సమాజానికి హానికరం, ఆర్థిక ప్రగతికి పెద్ద అవరోధం. ఈ వైఫల్యాలకు సమాధానం ప్రతి బిడ్డా తన సామర్థ్యాన్ని వికసింప చేసుకునేందుకు నాణ్యమైన చదువును అందించటంలో, నివారించదగ్గ బాధను తొలగించటానికి, ఉత్పాదకతను పెంచటానికి పౌరులందరికీ ఆరోగ్యాన్ని అందు బాటులోకి తేవటంలో, అన్ని వర్గాల నుంచి సమర్థ నాయకులు నైతిక, హేతుబద్ధ పద్ధతుల్లో ఎదిగేందుకు ఎన్నికల, రాజకీయ సంస్కరణల్లో, ఓటుకు, తమ జీవితాలకు మధ్య సంబంధాన్ని పౌరులు తెలుసుకునేందుకు అధికార వికేంద్రీకరణలో, అందరి హక్కులనూ పరిరక్షించేందుకు చట్టబద్ధపాలన, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాలు, ఆదాయాలలో మాత్రమే ఉంది. అప్పుడు పుట్టుక, కొందరికే అవకాశాలు కాకుండా నైపుణ్యాలు, కష్టపడటం వ్యక్తిగత అభివృద్ధికి నిర్దేశకాలవుతాయి.

బి.సి గణనను ఎజెండా చేయటం, రాజకీయ, పాలనా సంస్కరణలకు సంబంధించిన అసలైన అంశాల్ని, అందరికీ ఆర్థికావకాశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం చిత్తశుద్ధిలేని రాజకీయానికి, సమాజాన్ని విభజించి అయినా అధికారం పొందాలన్న రాజకీయ విన్యాసానికి నిలువెత్తు నిదర్శనం. అంతకంటే ఘోరం, మనం కులాన్ని, ఇతర విభజన బానిసత్వాల్ని అధిగమించాల్సిన సమయంలో బి.సి గణన కేవలం కుల స్పృహను మరింత పెంచేది కావటం.

# అందరికీ సామాజిక న్యాయం..ఈ పరిష్కారాలతో సాధ్యం

ఇటీవల మన దేశంలో కులం చుట్టూ కొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా రాజకీయ పార్టీలు ఇందుకు కారణం. ఎన్నికల రాజకీయంలో భాగంగా పోటాపోటీగా చేస్తున్న ఈ ప్రయత్నానికి పార్టీలు రెండు లక్ష్యాలను చెప్పుకుంటున్నాయి. సంక్షేమం పేరుతో ఇస్తున్న తాత్కాలిక తాయిలాలు మరింత మందికి అందేలా చేయటం, ఇప్పటికే రిజర్వేషన్ల పరిధిలో ఉన్న కొన్ని కులాలకి మరింత ఎక్కువ శాతం కోటా ఇవ్వటం, అందులో లేని కొన్ని కులాలకి చోటు కల్పించటం. ఎన్నికల మేనిఫెస్టోల్లో రిజర్వేషన్లకు సంబంధించిన హామీలివ్వటంతోపాటు కులగణన హామీని కూడా పార్టీలు ఇస్తున్నాయి.



ఈ నేపథ్యంలో రిజర్వేషన్ పరిధిలోని కులాల్లో అణగారినవారికి న్యాయం చేయటానికి, రిజర్వేషన్ల బయట ఉన్న కులాలవారిలో అవకాశాలు అందుకోలేనివారు అసూయాద్వేషాలకు గురవకుండా వ్యవహరించటానికి అవసరమైన మార్పులు, మైనారిటీ రిజర్వేషన్లపై హేతుబద్ధ చర్చ అవసరం.

కేవలం ఫలానా తల్లి గర్భాన పుట్టిన కారణంగా నాకు మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యం, ఎదిగే అవకాశాలు లేవు అని స్వతంత్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటాక కూడా మన దేశంలో కోట్ల మంది ఆక్రోశించే పరిస్థితి ఉంది. పుట్టినకులం, తల్లిదండ్రుల విద్యార్హతలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి– ఇవి ఈనాటికీ నూటికి 80 మంది బిడ్డల భవిష్యత్తును శాసిస్తున్నాయి. ఈ పరిస్థితి కేవలం కొందరు బిడ్డలకో, కొన్ని కులాలకో మాత్రమే జరిగే అన్యాయం కాదు. సమాజం మొత్తాన్నీ కుంగదీసే చర్య. ప్రతి బిడ్డా ఒక మర్రి విత్తనం లాంటిది. సరైన పోషణ, రక్షణ, విద్యావకాశాలు అందితే ప్రతిభ వికసించి, తనకి, సమాజానికి మేలుచేసే మహావృక్షంలాగా ఎదిగే శక్తి ప్రతి బిడ్డలోనూ ఉంది. మన సమాజం చేస్తున్న రెండు భయంకర తప్పిదాలు ఈ బిడ్డలకి శాపం కావటమే కాకుండా జాతిని కుంగదీస్తున్నాయి. మొదటిది, ఈ బిడ్డలందరికీ ఎదిగే అవకాశాలనివ్వకుండా పుట్టుకతోనే వారి భవిష్యత్తుని సమాధి చేసే అసమానత, వివక్ష. రెండోది, నివారించదగ్గ బాధలని, వ్యాధులని, కష్టాలని కొనసాగిస్తూ ఎందరో భవిష్యత్తును కాలరాస్తున్న నిర్లక్ష్యం.

ఈ పరిస్థితిని గమనించే మన రాజ్యాంగ నిర్మాతలు వివక్షలేని సమాజం సృష్టించటం, పుట్టిన పుట్టుక బిడ్డ భవిష్యత్తుని శాసించకుండా అందరికీ అవకాశాలు కల్పించటం మౌలిక లక్ష్యాలుగా ప్రతిపాదించారు. అందులో భాగంగా అందరికీ మంచి విద్యని, ఆరోగ్యాన్ని, అవకాశాలని అందించటం లక్ష్యాలుగా ఆదేశిక సూత్రాలని రాజ్యాంగంలో చేర్చారు. వాటిని అందుకునేందుకు వీలుగా వ్యక్తి స్వేచ్ఛకి, ప్రాథమిక హక్కులకి పెద్దపీట వేశారు. ఈ హక్కులు, స్వేచ్ఛ ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా పౌరులందరికీ సంక్రమించాయి. అందుకే రాజ్యాంగ పీఠికలోనే భారత ప్రజలమైన మనం ఒక దేశంగా ఏర్పడి, న్యాయాన్ని, స్వేచ్ఛని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని అందరికీ అందించే లక్ష్యంతో రాజ్యాంగాన్ని ప్రకటించుకున్నామని స్పష్టం చేశారు. స్వేచ్ఛతోపాటు వివక్షలేని సమాజం, అందరికీ సమన్యాయం, అన్ని వర్గాల మధ్య సుహృద్భావం మనకు రాజ్యాంగం నిర్దేశించిన ప్రామాణిక సూత్రాలు. వీటికి అనుగుణంగానే మన విధానాలు, చట్టాలు ఉండాలి. వీటిని నిరంతరం పరిరక్షించుకోవటం అవసరం. వీటిలో ఏ ఒక్క సూత్రం దెబ్బతిన్నా మిగిలిన రెండూ దెబ్బతిని రాజ్యాంగలక్ష్యం

విఫలమవుతుంది. అయితే పుట్టుకతో వివక్షలేని సమాజాన్ని నిర్మించుకోవాలన్న ఈ ఉదాత్త లక్ష్యాన్ని నెరవేర్చాలంటే సదాశయాలు మాత్రమే చాలవని రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు. స్వాతంత్ర్యం అనంతరం పదేళ్లలో అందరికీ మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం అందాలని ఆశించారు. అందుతుందని నమ్మారు. ఈలోగా, పుట్టుకతో వివక్షకి గుర్తై దగాపడ్డ కుటుంబాలకి ప్రత్యేక సహాయాన్ని అందించి, ఉన్నత విద్యలోను, ఉద్యోగాలలోను అవకాశాలను అందిస్తే న్యాయం జరుగుతుందని సంకల్పించారు. ఆ విధంగానే రిజర్వేషన్లను అమలు చేశారు. వివక్షకు గురైన వర్గాలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తాత్కాలిక పరిహారంగాను, సామాజిక న్యాయాన్ని అందించటంలో ఒక కీలకమైన అంశంగాను రిజర్వేషన్లను రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అయితే, రాజ్యాంగం అమలులోకి వచ్చాక పుట్టుకతో వివక్షను తొలగించేందుకు విద్య, ఆరోగ్యం మౌలిక సాధనాలన్న విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయటం వల్ల వివక్ష తొలగలేదు. కేవలం అధికారాన్ని లక్ష్యంగా, ప్రజాధనాన్ని దోచుకోవటమే ధ్యేయంగా సాంప్రదాయ రాజకీయం రూపుదిద్దుకుంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు అధికారం కోసం ఓటు వేసే యంత్రాలగానే భావించారు. అందుకే నిరంతరం కంటితుడుపు చర్యలతో తృప్తి పరచటం, ప్రజల పన్నుల డబ్బుతో తాత్కాలిక తాయిలాలనివ్వటం, పౌరులను ఓటు బ్యాంకులుగా భావించటం తప్ప నిజాయతీగా సామాజిక సమన్యాయం అందించే ప్రయత్నం గాని, అన్ని వర్గాల ప్రయోజనాలని చిత్తశుద్ధితో కాపాడటం గాని, బీదరికాన్ని, వివక్షని అంతం చేసే ఏర్పాట్లు గాని జరగటం లేదు. దేశ ప్రయోజనాల కోసం ముందుండి నడిపించటం కాకుండా, తాత్కాలిక లబ్ధి కోసం, అధికారం కోసం ఎంతకైనా తెగించటం ఆ పాత రాజకీయం స్వభావం. అందులో భాగంగానే కులాన్ని ఓ ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టటానికి రిజర్వేషన్లను ఓ అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. ఏ కులనిర్మూలన కోసమైతే మన రాజ్యాంగ నిర్మాతలు కోటా విధానం పెట్టారో, ఆ లక్ష్యం శాశ్వతంగా నెరవేరకుండా కులాన్ని స్థిరీకరించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం కులాల మధ్య రకరకాలుగా చిచ్చుపెడుతున్నారు. ఓట్ల కోసం మేలుచేసినట్లు నటిస్తున్నారు. ఆ పాతరాజకీయం వల్లే స్వాతంత్ర్యం వచ్చి, రిజర్వేషన్లు పెట్టి ఇన్ని దశాబ్దాలు గడిచినా అణగారినవర్గాల్లో గణనీయ శాతం ఇంకా దుర్భర జీవితాల్ని గడుపుతున్నారు. ఓపక్క సమాజంలో సంపద పెరుగుతుంటే, వీరు మాత్రం చేయిజాచి అర్థించేవారుగానే బతుకుతున్నారు. రోజువారీ జీవితం గడపటానికి ప్రభుత్వం అమలు చేసే తాత్కాలిక పథకాలు, ఉపశమనాలు; సమస్యల గురించి లోతుగా ఆలోచించకుండా మత్తులో ఉండేందుకు విరివిగా మద్యం అందుబాటు.. ఇదే కోట్ల మంది అణగారిన వర్గాల జీవితం. పొట్టకూటి కోసం నగరాలకు వలస పోయేవారు సరైన నివాస వసతి కూడా లేకుండా కష్టాలు పడుతున్నారు. కొవిడ్ కాలంలో వలసదారులు సొంతూళ్లకు నడిచివెళ్లిన దృశ్యాలు ఆ అమానవీయ పరిస్థితిని ప్రస్ఫుటంగా తెలియచెప్పాయి.

రాజకీయ నేతలు కొద్దిమంది లబ్ధిపొందినవారిని చూపిస్తూ కోట్ల మంది అణగారినవారికి న్యాయం చేస్తున్నట్లు ప్రచారం చేస్తూ రిజర్వేషన్ల ద్వారా ఎన్నికల లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో రిజర్వేషన్లలో ఆర్థికాంశమే కీలకమైనదైనా అది మరుగునపడి సామాజిక అస్తిత్వం పెద్దఎత్తున చర్చనీయాంశమవుతోంది. రిజర్వేషన్ వల్ల ఎంతమందికి ప్రయోజనం కలుగుతోంది, అందరికీ ప్రయోజనం కలగాలంటే, కుల నిర్మూలన దిశగా సామరస్యత నెలకొనాలంటే ఎలాంటి విధానాలు అవసరం అనే చర్చ లేకుండా దాదాపు ప్రతి కులం తమను రిజర్వేషన్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేస్తున్నాయి. రిజర్వేషన్ ఒక కులానికి హోదాగా, గుర్తింపుగా తయారైంది.

రిజర్వేషన్లు, కులనిర్మూలనపై స్పష్టమైన ఆలోచన ఉంది కాబట్టే దళిత క్రైస్తవుల్ని ఎస్.సి జాబితాలో చేరుస్తూ ఆగస్టు 25, 2009న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన తీర్మానాన్ని లోక్‌సత్తా శాసనసభ్యునిగా జయప్రకాష్ నారాయణ్ స్పష్టంగా వ్యతిరేకించారు. దళితులకి, దళిత క్రైస్తవులకి – ఇరువర్గాలకి న్యాయం చేసే ప్రత్యామ్నాయ మార్గాలని ప్రతిపాదించారు.

ఎస్.సిలకుండే అన్ని హక్కులతో దళిత క్రైస్తవులకు బిసి–సి కేటగిరీలో వారి జనాభా మేరకు విద్య, ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తూ రిజర్వేషన్ కల్పించాలని జేపీ ప్రతిపాదించారు. అంటే ప్రస్తుతమున్న బిసి'సి' కోటాలో ఒక్క శాతం రిజర్వేషన్‌కి పరిమితం చేయకుండా దళిత క్రైస్తవులు జనాభాలో ఎంత శాతం ఉంటే అంత శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. ఉదాహరణకి సమాజంలో మూడు శాతం దళిత క్రైస్తవులుంటే, చదువులో, ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్లు వారికివ్వటం సముచితం. ఆ విధంగా వారికి పూర్తిన్యాయం జరుగుతుంది. దళిత క్రైస్తవుల జనాభాను తాజాగా నిర్ధారించి ఆ మేరకు బిసి–సి కోటా పెంచి రిజర్వేషన్‌ను కల్పించాలని లోక్‌సత్తా పేర్కొంది. బి.సి వర్గీకరణ ఉంది కాబట్టి, ఇందుకు ఎటువంటి సమస్యా తలెత్తదు. వర్గీకరణ ఉన్న కారణంగా బి.సి 'సి'లో ఇచ్చిన రిజర్వేషన్లు కేవలం దళిత క్రైస్తవులకి మాత్రమే వర్తిస్తాయి.



అందులో దళిత క్రైస్తవులకే ప్రయోజనం చేకూరుతుందిగానీ, ఇతర కులాలవారు వారితో పోటీపడలేరు. అదేసమయంలో దళితుల ఎస్.సి కోటాలో దళిత క్రైస్తవుల నుంచి పోటీ ఉండదు. అలాగే బిసి-సిలో రిజర్వేషన్ కల్పించేటప్పుడు ఎస్.సిలకు రిజర్వేషన్ ద్వారా వర్తించే ప్రత్యేక హక్కులు, ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టం తదితర అన్ని హక్కుల్నీ కల్పించవచ్చు. అంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించకుండానే ఎస్.సిలకుండే అన్ని హక్కుల్నీ దళిత క్రైస్తవులకీ ఇవ్వాలని జేపీ పరిష్కారం చూపుతున్నారు. దీనివల్ల రాజ్యాంగపరమైన సమస్యా ఉండదు. ప్రస్తుతమున్న ఎస్.సిలకూ ఇబ్బంది ఉండదు.

ఇంత స్పష్టంగా పరిష్కారం కన్పిస్తుంటే, పెనుసమస్యల్ని సృష్టించేందుకు ఎందుకు ప్రయత్నించటం? గోటితో పోయేది గొడ్డలి దాకా తెచ్చుకోవటం ప్రజాహితాన్ని చేతులారా దెబ్బతీయటమే. ఈవేళ మనం తీసుకునే చర్య రేపు దేశ ఐక్యతకు, జాతి భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారకూడదు. ప్రజాస్వామ్యం, ధర్మం, జనహితం, అన్ని వర్గాల ప్రయోజనాలనూ పరిరక్షించే దిశగా మనం పరిష్కారాన్ని వెతకాలనే విజ్ఞతతోనే, బాధ్యతతోనే జేపీ ఈ పరిష్కారం సూచించారు.

“దళిత క్రైస్తవులకు ఎస్.సి హక్కులు లభించేందుకు ఎటువంటి సమస్యాలేని పరిష్కారం ముఖ్యమా? లేక కంటితుడుపుగా ఏదో చేశామనిపించుకునేందుకు ఎస్.సిల్లో చేర్చాలని తీర్మానం చేసి, కులాల మధ్య చిచ్చుపెట్టటం మినహా చివరకు ఎటువంటి పరిష్కారం లేకపోవటమా?.. అందరికీ మేలు చేసే పరిష్కారమా లేక ప్రజల్ని విభజించి మభ్యపెట్టి ఏమీ జరగకుండా సమస్యను యథాతథంగా కొనసాగించటమా?.. అందరూ ఆలోచించి విజ్ఞతతో వ్యవహరించాలి”.

అదేవిధంగా ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లను తప్పుపట్టలేం. అయితే వాటిని మత ప్రాతిపదికన కాకుండా వెనుకబాటుతనం ప్రాతిపదికన కల్పించాలి. ఆ మతంలో వివిధ కులాల, వర్గాల పేదలకు ఇప్పటికే బి.సి కేటగిరిలో ఉన్న రిజర్వేషన్లు కొనసాగిస్తూ వెనుకబాటుతనంపై ప్రామాణికంగా వివరాలు సేకరించి అవసరమైన మార్పులు చేయవచ్చు.

మొత్తంగా అందరికీ ఎదిగే అవకాశాలు కావాలి, కుల వివక్ష శాశ్వత నిర్మూలన జరగాలి, కులరహిత సమాజం అంతిమ లక్ష్యం కావాలి, రిజర్వేషన్లు అందుకు దోహదం చేయాలి.

ఈ నేపథ్యంలోనే కుల విద్వేషాలకు, ఉప కుల వ్యత్యాసాలకు తావులేకుండా పిల్లలందరికీ ఎదిగే అవకాశాలు కల్పించటానికి జేపీ చెబుతున్న విధానంలోని అంశాలు..

## పౌర సమాజం పాత్ర

**రిజర్వేషన్లు, కులం అంశాల్లో రాజకీయ అవకాశవాద ధోరణుల్ని కట్టడి చేయటంలో పౌర సమాజం పాత్ర:**

- **పత్రికల్లో, టీవీల్లో బహిరంగ చర్చ ప్రమాణాల్ని పెంచి, ఈ అంశాల గురించి అవగాహన కల్పించాలి.**
- **ప్రపంచంలో ఇతర దేశాల్లో ఈ వివక్ష నుంచి బయటపడేందుకు ఏయే చర్యలు తీసుకుంటున్నారో తెలియచేస్తూ వాటిపై ఆలోచనను కల్పించి అవగాహనను పెంపొందించాలి.**
- **కులాన్ని మించి ప్రతి కుటుంబానికీ స్వప్రయోజనాలున్నాయి అనే విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా నిరంతరం వివరించాలి. ఉదాహరణకు, మన ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం ఉంటే లేదా పిల్లలకి మంచి చదువు కావాలంటే, మనం డాక్టర్ కులాన్నో, టీచర్ మతాన్నో పట్టించుకోం. ఎవరి వల్ల మన ప్రయోజనాలు నెరవేరతాయో ఆలోచించి వారి సేవలనే కోరుకుంటాం. కుల వివక్షని, మత విద్వేషాలని అంతం చేయాలంటే అంతకు మించిన స్వప్రయోజనాలు సమాజానికి అర్థమయ్యేలా చేయటమే సరైన మార్గం.**

**కులాన్ని, వివక్షను కొనసాగించటంలో వివాహ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుంది. కాబట్టి యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి మనసుకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛని, ధైర్యాన్ని ఇవ్వటం, కుల మతాంతర వివాహాలకు ప్రత్యేకంగా రాయితీలు ఇచ్చి ప్రోత్సహించటం అవసరం.**

## ప్రయివేటు రంగంలో..

**ప్రయివేటు రంగంలో కూడా బీదలకి, వివక్షకి గురవుతున్న వర్గాలకి ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రత్యక్ష ఏర్పాట్లు అవసరం.**

**1) ఉపాధిలో సమానావకాశాలకి చట్టం తెచ్చి, అర్హతలున్నా వివక్ష కారణంగా కొన్ని వర్గాలకి ఉపాధి లభించకపోతే ఆ కంపెనీల మీద కఠిన చర్యలు తీసుకునే ఏర్పాటు ఉండాలి.**

**2) ప్రతి కంపెనీ వచ్చే సంవత్సరం నుంచి ఐదేళ్ల కాలంలో సుమారుగా ఎంతమందిని ఏ స్థాయిలో, ఏయే అర్హతలతో నియమించే అవకాశముందో బహిర్గతం చేయాలి. అలాగే తీసుకునే ఉద్యోగాల్లో ఏయే వర్గాలకు చెందినవారిలో ఎంతమందిని తీసుకోనున్నారో బహిర్గతం చేసే చట్టం ఉండాలి.**

**3) ప్రభుత్వం, ప్రయివేటు రంగం రెండూ కలిసి అణగారిన వర్గాలు, బీద కుటుంబాల పిల్లలకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చి ఉపాధికి అర్హులయ్యేలా ఏర్పాటు చేయాలి.**

**4) ఒకవేళ కొన్ని కంపెనీలు కావాలని కులవివక్షను పాటిస్తున్నట్లు తేలితే, పైన పేర్కొన్న చట్టపరమైన చర్యలేకుండా పౌర సమాజ సంస్థలు సమాజాన్ని చైతన్యం చేసి ఆ కంపెనీల ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ లేకుండా చేయాలి.**

**.. ఈ చర్యల్ని చేపడితే ప్రయివేటు రంగంలో అన్ని వర్గాలవారికీ సమానావకాశాలు కచ్చితంగా లభిస్తాయి.**



- ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు సుప్రీంకోర్టు తీర్పుకి లోబడి 50 శాతం మించకుండా కొనసాగించాలి.

- రిజర్వేషన్లని కలెక్టర్ల కొడుకులకో, మంత్రుల కూతుళ్లకో కాకుండా నిజంగా అర్హులైన బీదలకు మాత్రమే వర్తింపచేయాలి.
- ప్రస్తుతం రిజర్వేషన్లు పొందని వర్గాలలో బీదలని, మంచి విద్యావకాశాలు లేనివారిని ప్రత్యేకంగా గుర్తించి వారికి బోనస్ మార్కులు కేటాయించి, ఆ పిల్లలు సంపన్నుల బిడ్డలతో పోటీపడే అవకాశాలు కల్పించాలి.
- ప్రభుత్వం పాఠశాల విద్య మీద సర్వశక్తుల్నీ కేంద్రీకరించి, పుట్టిన ప్రతి బిడ్డకూ కులంతో, డబ్బుతో నిమిత్తం లేకుండా 12వ తరగతి వరకూ మంచి ప్రమాణాల విద్యను అందించే ఏర్పాటు చేయాలి.

- అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులకి ఆర్థిక స్తోమతుతో నిమిత్తం లేకుండా ఉన్నత విద్యకు ప్రభుత్వమే అవకాశం కల్పించాలి.

.. ఈ ఏర్పాట్లను చిత్తశుద్ధితో అమలుచేస్తే సమీప భవిష్యత్తులోనే వివక్షలేని సమాజాన్ని సృష్టించి అందరికీ న్యాయం చేయటం సాధ్యమవుతుంది.

విద్యకు పునాది అయిన పాఠశాల స్థాయిలో అభ్యసన ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయి. నూటికి 80 మంది పిల్లల చదువు కేవలం సర్టిఫికెట్లకి తప్ప ఎందుకూ పనికిరాని స్థాయిలో ఉంది.

పాఠశాల స్థాయిలో రిజర్వేషన్లు లేవు. కానీ స్కూలు స్థాయిలో అధ్వాన్న విద్య అందటం వల్ల పైస్థాయిలో రిజర్వేషన్ అవకాశాల్ని అందుకునే శక్తి ఆయా కులాల్లో అత్యధికులకి ఉండటం లేదు. ఒకవేళ రిజర్వేషన్ పొందినా అణగారిన వర్గాల జీవితాల్లో మౌలిక మార్పుకి దోహద శక్తి కాలేకపోతున్నారు. అందువల్ల నిజంగా దళితులు, ఇతర అణగారిన వర్గాల తరపున పోరాటం చేస్తున్నామని చెబుతున్న రాజకీయ పార్టీలు, సామాజిక శక్తులు పాఠశాల విద్యను సమూలంగా బాగుచేసేందుకు, కులం, మతంతో సంబంధం లేకుండా ఈ దేశంలో ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందించేందుకు సర్వశక్తులతో కృషి చేయాలి. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా తరపున జేపీ ఇందుకోసం పెద్దఎత్తున ప్రయత్నం చేస్తున్నారు.

**(సోర్స్: జేపీ వ్యాసాలు, ఇంటర్వ్యూలు)**

# వెనుకబాటుతనం ఆధారంగానే ముస్లిం రిజర్వేషన్లు




డాక్టర్ జయప్రకాష్ నారాయణ్: అధ్యక్షా, మన సమాజంలో రిజర్వేషన్లను మించి రాగద్వేషాలను పెంచే సమస్య మరొకటి లేదు. ఎక్కడకు వెళ్లినా రిజర్వేషన్ అనగానే జీరో సమ్ గేమ్ కాబట్టి, కొంతమందికి లాభం మిగతావాళ్లకి అంతే మేరకు నష్టం. అవకాశాలు కొంతమందికి వస్తాయి. మిగతావాళ్లకు తగ్గుతాయి కాబట్టి విపరీతంగా అసూయ, ద్వేషం, క్రోధం చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కీలక అంశంపై దృష్టి పెడుతున్నాం. పేదరికానికి కులం లేదు, మతం లేదు, భాష లేదు, ప్రాంతం లేదు. ఈ దేశంలో ఇప్పటికి కూడా చాలామంది విద్యాపరంగా, ఆర్థికంగా పేదరికానికి గురవుతున్న మాట, వివక్షకు గురవుతున్న మాట వాస్తవం. కాబట్టి కులమతాలతో సంబంధం లేకుండా ఏర్పాటు చేయాలి. కానీ ఇవ్వాళ చర్చలో, నిన్న చర్చలో కొన్ని అపశ్రుతులు దొర్లినాయి. మన దేశంలో పాలనే తప్పుచేస్తున్నట్లుగానో.. రాజ్యాంగమే తప్పు చేస్తున్నట్లుగానో.. మత వివక్ష చూపుతున్నట్లుగానో కొంత చిత్రించే ప్రయత్నం జరిగింది. దీనిని నేను పూర్తిగా నిరసిస్తున్నాను. ఎందుకంటే, మన దేశంలో పాలనలో ఉన్న తప్పుల్ని నేను తిట్టినట్లు ఈ దేశంలో ఎవరూ తిట్టలేదు. గత 15 ఏళ్లలో రాజకీయంలో తప్పుల్ని నా అంతగా ఎవరూ విమర్శించలేదు. కానీ, ఉదాత్తమైన రాజ్యాంగాన్ని ఈ దేశం అందరికీ ఇచ్చింది. మతం పేరుతో ముక్కలైనా కూడా కులం, మతం, భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ వయోజన ఓటుహక్కుని మొట్టమొదటిసారిగా ఇచ్చిన రాజ్యాంగం భారత రాజ్యాంగం. ఆర్టికల్–29 గాని, 30 గాని హిందువులకు లేని హక్కుల్ని ఇతర మతాలకు కల్పించాయని మర్చిపోకూడదు. మనం త్వరపడి ఆవేశంతో దేశంలో ప్రజలను అవమానించే విధంగా మాట్లాడితే ప్రమాదం జరుగుతుంది. నాకు తెలిసి ప్రజాస్వామ్య రాజ్యాంగాలలో మరే దేశంలో లేనట్లు మెజారిటీకి హక్కులు లేకుండా మైనారిటీలకు ప్రత్యేక హక్కులు ఇచ్చింది ఒక్క భారత రాజ్యాంగం మాత్రమే.

మూడవది, ముస్లిం రిజర్వేషన్లు కొత్త కాదు. ఇవ్వాళ చర్చకు రాలేదు. మన రాష్ట్రంలోనే 5 కులాలకు రిజర్వేషన్ ఉన్నది. ఒకటి మెహతా. బిసి 'ఎ' పేరుతో మెహతా కులానికి రిజర్వేషన్ ఉంది. మరో నాలుగు కులాలకు రిజర్వేషన్ ఉన్నది. ఆ కులాలు దూదేకుల, పింజారి, నూర్ బాషా, లదాఫ్. ఈ అయిదు కులాలకు ఇప్పటికే రిజర్వేషన్ ఉంది. అంటే ముస్లిం సమాజంలో 20 శాతం జనాభాకి మన రాష్ట్రంలో రిజర్వేషన్లు ఉన్నాయి. ముందు అది గుర్తించాలి. ఇది హిందూ ముస్లిం సమస్య కాదు. వెనుకబాటుతనాన్ని సరిగా గుర్తించారా లేదా అని చర్చించాలి. మూడు లిటిగేషన్లలో ఇంత పరాభవం ఎందుకు వచ్చింది? కోర్టుల్ని తిడుతున్నాం. కోర్టుల తప్పు లేదు. నిర్వంద్వంగా ఓటు బ్యాంకు రాజకీయాన్ని ప్రభుత్వాలు చేశాయి. తొందరపాటుతో ఏదో చేసేశామనే భ్రమను కల్పించే ప్రయత్నం చేశామే తప్ప, నిజాయతీగా చిత్తశుద్ధితో జనాభాలోని బ్యాక్‌వర్డ్‌నెస్‌ని పరిగణలోకి తీసుకునే ప్రయత్నం చేయలేదు. గణాంకాల గురించి చాలా మాట్లాడారు. పెద్దలందరినీ అగౌరవపరచాలని

కాదు.. నాకు తెలిసి, చాలా అవాస్తవమైన గణాంకాలు చెప్పారు. అధ్యక్షా, నా దగ్గర హైకోర్టు తీర్పు ఉన్నది. సచార్ కమిటీ నివేదిక ఉన్నది. సచార్ కమిటీ నివేదిక ప్రకారం మన రాష్ట్రంలో ముస్లిం జనాభా 9.2 శాతం ఉంటే, ఉద్యోగాలలో మన రాష్ట్రంలో ముస్లిల వాటా 9.3 శాతం. 9 లక్షల 49 వేల ఉద్యోగుల్లో రాష్ట్ర ప్రభుత్వంలో 88 వేల ముస్లింలు ఉన్నారు. దానిలో హోం శాఖలో, పోలీసు శాఖలో 14.2 శాతం. సగర్వంగా చెప్పుకోవచ్చు మనకు వివక్ష లేదు. రెండవది, విద్యాపరంగా వెనుకబాటని చాలామంది గౌరవసభ్యులు మాట్లాడారు. ఏ లెక్కలు చూశారో నాకర్థం కావటం లేదు. భారతదేశం లెక్కలు వేరు, మన రాష్ట్రం లెక్కలు వేరు. 2001 లెక్కల ప్రకారం మన రాష్ట్రం మొత్తం మీద అక్షరజ్ఞానం 60.5 శాతం ఉంటే, ముస్లింలలో అధ్యక్షా, 68 శాతం ఉన్నది. దయచేసి సభంతా గమనించండి. సచార్ కమిటీ చెప్పిన వాస్తవాలు చెబుతున్నాను. నేను సొంతంగా చెబుతున్నవి కావు. అలాగే 7 నుంచి 16 ఏళ్ల వయసు వరకు ఎంతకాలం స్కూలింగ్ జరుగుతుంది? పాఠశాలకు ఎంతకాలం వెళ్తున్నారు? సగటున రాష్ట్రంలో 4.38 సంవత్సరాలు. పాఠశాల విద్య అందుతుండే ఆ వయసులో, ముస్లింలలో 4.42 సంవత్సరాలు. అలాగే ప్రైమరీ స్కూల్ ఎవరు పూర్తిచేస్తున్నారు? సగటున.

అధ్యక్షా, కీలకమైన అంశాలున్నాయి. కొంచెం సమయం ఇవ్వండి. నేనేం ఎక్కువ సమయం తీసుకోను, అప్రస్తుతం మాట్లాడను. ముస్లింలలో 74.7 శాతం, అంటే 75 శాతం ప్రైమరీ స్కూల్ పూర్తిచేస్తున్నారు. కానీ ఎస్.సి, ఎస్.టిల్లో 59.9 శాతం మాత్రమే. మిగిలినవారిలో 75 శాతం. కాబట్టి అక్కడ కూడా విద్యాపరంగా ముస్లింల మొత్తాన్ని చూస్తే అక్కడ వివక్ష లేదు. మిడిల్ స్కూల్ అదే రీతిన 53 శాతం ముస్లింలలో, 42 శాతం ఎస్.సి, ఎస్.టిలలో, ఇతరులలో 57 శాతం. మెట్రిక్యులేషన్ 41 శాతం ముస్లింలలో, 41 శాతం ఇతరులలో, ఎస్.సి, ఎస్.టిలలో 24 శాతం కాబట్టి విద్యాపరంగా వెనుకబడ్డారని అనటానికి మొత్తంగా ముస్లింలను చూస్తే ఆధారాలు లేవు. కాబట్టి, ముస్లింల ప్రతి గ్రూపుని మనం జాగ్రత్తగా అంచనా వేయాలి. హైకోర్టు ఏమి చెప్పిందీ.. అయ్యా, మీరు ప్రతి వర్గానికీ లెక్కలు వెయ్యండని చెప్పింది. మన వాళ్లు మూడుసార్లు కొండను తవ్వి ఎలుకనే పట్టారన్న విధంగా, మన వాళ్లిచ్చింది 12 కులాలకి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ, మరో 10 కులాలను పక్కనపెట్టి, ఆ 10 కులాలను మినహాయించి, ప్రతి ముస్లింకూ రిజర్వేషన్ అన్నారు. ఎంత విచిత్రంగా ఉందంటే, డా. మర్రి చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగా మండల్ కమిషన్ ఉద్యమం వస్తే ఆయనొక మాట అన్నారు. మండల్ కమిషన్ నివేదికను చదివినట్లయితే, ఆ రోజు సమర్థిస్తున్నవాళ్లు వ్యతిరేకిస్తారు, వ్యతిరేకిస్తున్నవాళ్లు సమర్థిస్తారు అన్నారు. ఎందుకంటే, మండల్ కమిషన్‌లో రెడ్డి, కాపు, కమ్మ మూడు కులాల్ని కూడా బి.సిలలో చేర్చారు. చాలామందికి ఆ సంగతి తెలియదు. అదే గనక చేసినట్లయితే, దానిని సమర్థించేవారు వ్యతిరేకించేవారు.. వ్యతిరేకించేవారు సమర్థించేవారు. అందుచేత విషయం తెలియకుండా మాట్లాడుతున్నాం. హైకోర్టు తీర్పులో అధ్యక్షా, వారు చెబుతుందల్లా ఏమిటంటే, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని వాళ్లు అనలేదు, ఇవ్వొచ్చు కానీ, ఎక్కడ లెక్కలు వేశారు?

112 బి.సి కులాలు అభ్యర్థన పెట్టుకుంటే వాటిని పక్కన పెట్టారు. బి.సి 'ఎ', బి.సి 'బి'లకు చెందిన అయిదు కులాలవారుంటే వారిని అలాగే ఉంచి మిగతావారిని మాత్రం బి.సి 'ఇ'గా ఏర్పాటు చేశారు. మరి వారి సంగతేమిటి? అలాగే రాష్ట్రంలో ముస్లిం జనాభా అన్ని చోట్లా ఒకే రకంగా లేదు. రాయలసీమలో ముస్లిం జనాభా 14.2%, తెలంగాణలో 12%, కోస్తాంధ్రలో 4.4%. కాబట్టి మీరు కిందిస్థాయి ఉద్యోగాలలో రిజర్వేషన్‌ను ఇచ్చి అంతా ఒకే విధంగా రిజర్వేషన్ కల్పిస్తే కొన్ని ప్రాంతాలలోని ముస్లింలకు అన్యాయం జరుగుతుంది.

ముఖ్యంగా మన రాష్ట్రంలో రాష్ట్రమంతా ఒక యూనిట్‌గా లేదు. సిక్స్ పాయింట్ ఫార్ములా ప్రకారం జిల్లా యూనిట్‌గా ఉన్నది, జోన్ యూనిట్‌గా ఉన్నది. జోన్‌వారీగా అక్కడ ముస్లిం జనాభాను వెనుకబాటుతనాన్ని బట్టి రిజర్వేషన్ కేటాయించాల్సిన అవసరమున్నది.

కోర్టులో ముస్లిం రిజర్వేషన్‌ను గురించి గట్టిగా పోరాడాం. కానీ నాకు అర్థమైనంతవరకు కోర్టు జడ్జిమెంట్ చాలా జాగ్రత్తగా చదివితే సోదరుడు అక్బరుద్దీన్ చెప్పినట్లుగా చాలా తొందరగా, ఏమాత్రం సర్వే సమగ్రంగా చేయకుండా ఏదో చేయాలనే ఆదుర్దాతో చేశారే తప్ప శాస్త్రబద్ధంగా, సహేతుకంగా చేయలేదు. నిజానికి వెనుకబడిన తరగతులకు కేటాయించిన జనాభా కూడా చెప్పలేకపోయారు. ఫలానా వర్గాలు తప్ప మిగతావారంతా బి.సిలు అన్నారు. అంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు తప్ప మిగతావారంతా బి.సిలే అన్నట్లుగా ఉంది. ఇది అశాస్త్రీయం. అలాగే అంకెలలో ముస్లిం కమ్యూనిటీ మొత్తాన్ని చూస్తే, లిటరసీ, ఉద్యోగాలలో మిగతావారితో సమానంగా వస్తున్నాయి. కాబట్టి మీరు ప్రతి వర్గాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసే ఏర్పాటు చేయండి. మిగతా 112 కులాలను కూడా కలిపి మొత్తానికి నివేదిక వచ్చే ఏర్పాటు చేయండి.

మూడవది, శాస్త్రీయంగా వెనుకబాటుతనం అంటే ఏమిటి? లిటరసీ మిగతావారి కంటే ఎక్కువగా ఉంటే, విద్య చదివే కాలం ఎక్కువ ఉంటే మీరు వెనుకబాటుతనంగా ఎలా చెబుతున్నారు. మీరు నిర్ధారించే ఏర్పాటు చేయండి.

రిజర్వేషన్ల వల్ల జీవితాలు గట్టెక్కవు. అరవైమూడు సంవత్సరాల రిజర్వేషన్ రాజకీయంలో మనం ఏం చేశాం? ప్రతి కులం నేను ఎదిగానని గర్వంగా చెప్పుకోవటం కాకుండా నేను వెనుకబడ్డానని పోరాడే పరిస్థితికి తీసుకొచ్చాం. ప్రపంచంలో మరెక్కడా అటువంటిది ఉండదు. ఒక్క ఆంగ్లో ఇండియన్‌లు, పార్శీలు మాత్రమే మాకు వెనుకబాటుతనం లేదు, మాకు మీరిచ్చే ప్రత్యేక రాయితీలు అక్కర్లేదు, అందరితో సమానంగా హక్కులివ్వండి మీతో సరితూగుతామన్నారు. ఆ వివక్షకు గురైనవారిని వివక్ష నుంచి బయటపడేయకుండా.. ఇన్నేళ్ల రిజర్వేషన్ తర్వాత ఇవాళ్టికి కూడా 41% మంది మాత్రమే ఎస్.సిలు అయిదవ తరగతి వరకు చదివే పరిస్థితి ఉన్నది. ఇవాళ్టికి కూడా ఎస్.సి, ఎస్.టిలలో అక్షరజ్ఞానం సమాజంలో

**మతంతో సంబంధం లేకుండా వెనుకబాటుతనంతో ఉన్నటువంటి వర్గాలన్నింటినీ కూడా గుర్తించి ఈ రిజర్వేషన్ అమలు చెయ్యటం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచన చేసింది. వారిని మనసారా అభినందిస్తున్నాను. ఇది మతానికి సంబంధించిన విషయం కాదు. మళ్లీ మళ్లీ రాజకీయ లబ్ధి కోసం ముస్లిం మైనారిటీలు అనబోకండి. మతానికి అతీతంగా వెనుకబాటుతనం వారిని గుర్తించితే సుప్రీంకోర్టు దానిని అంగీకరిస్తుంది గానీ మతం పేరుతో అంటే మళ్లీ ఇవ్వలేకపోతుంది. రెండవ అంశం ఏమంటే, దయచేసి ఇప్పటికైనా దీనిలో ప్రతి వర్గానికి సంబంధించిన సమాచారం సేకరించండి. శాస్త్రీయంగా అర్హులైన పేదలకు ఫలితాలు వచ్చేట్లుగా చెయ్యండి. లేకపోతే మళ్లీ రేపొద్దున ఆ పేరుతో అర్హులైన పేదలు ఫలితం పొందకుండా ఉంటే అన్యాయం జరుగుతుంది. 3వ అంశం ఏమంటే ఏ వర్గాలకు అయితే 4 శాతం కేటాయించామో ఈ వర్గాల జనాభా రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉంది. మన రాష్ట్రంలో నియామకాలు ఈ జోనల్ సిస్టం వల్ల ఒక జిల్లాకు గానీ, ఒక జోన్‌కు గానీ నియామకాలు పరిమితం అవుతున్నాయి. కాబట్టి మళ్లీ ఈ వర్గాలలో ఆ జిల్లాలో, ఆ జోన్‌లో ఉన్న జనాభాను పరిగణలోకి తీసుకుని ఆ దామాషా ప్రకారం పంచినట్లయితే రాయలసీమ, తెలంగాణలో ఉన్న ఈ వర్గాలకు ఎక్కువసంఖ్యలో ఉన్న ఈ వర్గాలకు న్యాయం జరుగుతుంది. లేకపోతే ఊరికే గుడ్డిగా అమలు చేసినట్లయితే న్యాయం జరగదు. చివరి అంశమేమంటే 112 బి.సి కులాలు మమ్మల్ని కూడా చేర్చాలని కోరుతున్నారు. వాటిని వెంటనే పరిశీలించమని దయచేసి బి.సి కమిషన్‌ని కోరండి. దానిలో ఉన్నటువంటి సాధ్యాసాధ్యాలను బట్టి, అక్కడ ఉన్నటువంటి వాస్తవాలను బట్టి ఏ మేరకు వారికి ఇవ్వవచ్చో మనం నిర్ణయం చేసినట్లయితే త్వరగా ఊరట కలుగుతుంది. లేకపోతే కేవలం కొంతమందికి మీరు రాజకీయ లబ్ధి చేస్తున్నారు, మమ్మల్ని అన్యాయం చేస్తున్నారు అన్న భావం వచ్చి మళ్లీ సమాజంలో వైరుధ్యాలు వస్తాయి. వైషమ్యాలు లేకుండా చేయండి. చివరిగా వచ్చే 10, 15 ఏళ్లలో విద్య మీద, ఆరోగ్యం మీద, పేదరిక నిర్మూలన మీద, నైపుణ్యాల మీద నిజాయితీగా శ్రద్ధ పెట్టి రిజర్వేషన్ అవసరంలేని సమాజాన్ని నిర్మించండిగానీ, రిజర్వేషన్‌ను నిరంతరం కొనసాగించేలా చేసి ఆ పేరుతో ఓటు బ్యాంకులుగా మార్చేసే సమాజం ఈ దేశానికి మంచిది కాదు, రాజకీయానికి మంచిది కాదు, ఎల్లకాలం ఇది నిలవదు. కాబట్టి దాని మీద దృష్టి పెట్టమని కోరుతూ, మీకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.**

మిగతావారితో పోలిస్తే 14, 15% తక్కువగా ఉన్నది. గ్రామ ప్రాంతాలలో ఉన్న మహిళలలో అక్షరజ్ఞానం 26% మాత్రమే ఉన్నది. ఇంత దారుణమైన పరిస్థితి ఎందుకు వచ్చింది.

రాష్ట్రంలో విద్య, ఆరోగ్యాన్ని ఇవ్వకుండా, పాలన బాగుచేయకుండా, పుట్టిన ప్రతి బిడ్డకూ అవకాశాలు ఇవ్వకుండా ఈ దేశాన్ని బాగుచేయలేము. ప్రాంతాల మధ్య వ్యత్యాసాన్ని తొలగించండి. ఎక్కడ ముస్లిం జనాభా ఎక్కువ వుంటే అక్కడ ఎక్కువ వచ్చేట్లు, ఎక్కడ ముస్లిం జనాభా తక్కువ ఉంటే అక్కడ తక్కువ వచ్చేట్లుగా చేసి శాస్త్రీయ అధ్యయనం చేయండి. కానీ దీర్ఘకాలంగా నాలుగు చర్యలు చేపట్టాలి.

మొదటిది, పుట్టిన ప్రతి బిడ్డకూ మంచి ప్రమాణాల విద్యను అందించి పదవ తరగతి పూర్తయ్యేదాకా పేదలంటే గవర్నమెంట్ స్కూలు, డబ్బున్నవాళ్లంటే ప్రయివేటు స్కూలు కాదు. ఆడపిల్లలంటే గవర్నమెంట్ స్కూలు, మగపిల్లలంటే ప్రయివేటు స్కూలు కాదు. పుట్టిన ప్రతి బిడ్డకూ మంచి ప్రమాణాల విద్యను అందించి పదవ తరగతికి వచ్చేటట్లుగా ఏర్పాటు చేయాలి. ఇది ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం కావాలి.

రెండవది, ప్రతి ఒక్కరికీ మలేరియా నుంచి గుండెజబ్బు చికిత్స వరకు ఆరోగ్యం బీదలకు అందే ఏర్పాటు కావాలి.

మూడవది, ఇవాళ ఉన్నత విద్య కోసం ప్రభుత్వాన్ని మనసారా అభినందిస్తున్నాను. తప్పులు చేస్తే నేను కచ్చితంగా తిడతాను. మంచి చేస్తే సంతోషంగా సమర్థిస్తాను. బహుశా దేశంలో ఎక్కడా లేని స్థాయిలో అతి పెద్దఎత్తున ఉన్నత విద్య కోసం, డబ్బులు లేకపోతే విద్య అందని పరిస్థితి లేకుండా రాష్ట్రంలో రూ.2,300 కోట్లు కేటాయించటం చాలా మంచిది. నేను మనసారా అభినందిస్తున్నాను. ఇప్పటికి కూడా ఉన్నత విద్యలో సహాయం అందనివారున్నారు. మంత్రిగారిని అడిగితే వారు చెప్పింది ఏమిటంటే, ఇంకా 1190 కోట్లు ఉన్నత విద్యలో డిమాండ్ ఉందన్నారు. అంత డబ్బు ఇవ్వలేకపోవచ్చు. కనీసం బ్యాంకు గ్యారంటీతో రుణాలు ఇప్పించే ఏర్పాటు చేయండి. ఇంట్రెస్ట్ సబ్సిడీ ఇవ్వండి. తర్వాత వాళ్లు అప్పు తీర్చుకునే ప్రయత్నం చేస్తారు.

నాలుగవది, కులానికి, బీదరికానికి సంబంధం లేదు. బ్రాహ్మణులు, రెడ్లు, వెలమలు, కాపులలో కూడా బీదవారు ఉన్నారు. ఇంకా ఇతర కులాలలో కూడా ఉన్నారు. దయచేసి గ్రామీణ ప్రాంతాలలో ఉన్నవారు పట్టణాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నవారిని ప్రత్యేకంగా గుర్తించి రిజర్వేషన్ సాధ్యం కాకపోతే వారికి వెయిటేజీ ఇవ్వండి. ఒక కలెక్టర్ కొడుక్కో, మంత్రి కూతురుకో కులం పేరుతో రిజర్వేషన్ కొనసాగిస్తూ నిరుపేదలకు అవకాశాలు లేకుండా ఒక గ్రామంలో స్కూలుకు వెళుతున్న బిడ్డకు ఎనభై మార్కులు వస్తే కలెక్టర్ కొడుక్కి ఎనభై అయిదు మార్కులు వస్తే ఎవరికి మెరిట్ ఉన్నట్లు అధ్యక్షా? కారులో వెళ్లి ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్న కలెక్టర్ కొడుకా, మంత్రి కూతురా, లేదంటే ఆ గ్రామంలో ఉన్న కూలి బిడ్డకా? కాబట్టి వెనుకబాటుతనాన్ని నిజాయితీగా గుర్తించి గ్రామీణ పాఠశాలల్లోనే ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్న పిల్లలకు అదనంగా కొన్ని మార్కులు కేటాయించి కొన్ని సంవత్సరాలు గడిచాక రిజర్వేషన్ అవసరంలేని సమాజాన్ని సృష్టించండి గానీ మళ్లీ పది, ఇరవై సంవత్సరాలు పోయాక మమ్మల్ని రిజర్వేషన్‌లో చేర్చండి, మమ్మల్ని చేర్చండి, రిజర్వేషన్లు పెంచండి అనే పద్ధతి లేకుండా అలాంటి గర్వించదగ్గ సమాజాన్ని తెస్తారని ఆశిస్తూ, కోర్టులను తిట్టటం కాకుండా నిజాయితీగా ఈ విషయంలో తప్పులు సవరిస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**(30-10-2010న అసెంబ్లీలో జేపీ ప్రసంగం)**

# నిండు చెరువులతోనే నీటి భద్రత

- డాక్టర్ సౌందర్య మనోహరి, గ్రామదీప్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు

జలవనరుల సంరక్షణ చాలా ముఖ్యమైనది. గ్రామాలలోని సంప్రదాయ జలవనరులు మానవ సమాజంతో అంతర్లీనంగా ముడిపడి ఉన్నాయి. సాగునీరు, తాగునీరు నిల్వ చేసుకోవటంలో, భూగర్భ జలాల రీఛార్జ్‌కి, నీటిలోని కాలుష్యాన్ని శుద్ధి చేయటానికి, మొక్కలు-జలచర వ్యర్థాల రీసైక్లింగ్‌తో నేలకు పోషకాలు చేరేలా చెరువులు దోహదం చేస్తున్నాయి. అంతేకాకుండా, మన గ్రామ చెరువులు వరదల నియంత్రణకు, ఎన్నో కోట్ల జీవరాసులకు ఆవాసంగా, ఆహారంగా, పరిసర ప్రాంత సూక్ష్మ ఆహ్లాదకర వాతావరణంతో, జీవనోపాధి కలిగిస్తూ, ప్రకృతి సౌందర్యంతో, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, సాంస్కృతిక వారసత్వం కలిగి ఎన్నో సేవలను అందిస్తున్నాయి. ఏప్రిల్ 2023లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నీటి వనరులపై సమగ్ర సెన్సెస్ నిర్వహించి విడుదల చేసిన గణనలో దేశంలో మొత్తం 24.2 లక్షల నీటివనరులు ఉండగా, 23.5 లక్షల (97.1%) వనరులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని తేల్చింది. దేశంలో 80% కంటే ఎక్కువ మంచినీరు, వ్యవసాయంలో వినియోగించబడుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అత్యధిక చెరువులు కలిగి ఉందని తెలిపింది.

కాని, అంతటి ప్రముఖ పాత్ర వహిస్తున్న గ్రామాలలోని చెరువులు తీవ్ర నిర్లక్ష్యానికి, కాలుష్యానికి, అక్రమ మట్టి తవ్వకాలకు, ఆక్రమణలకు గురయ్యి, దేశ చరిత్రలో ఎన్నడూలేని అత్యంత దారుణమైన, అతి తీవ్ర మంచినీటి సంక్షోభానికి కారణమవుతున్నాయి. అనేక జాతీయ, అంతర్జాతీయ నివేదికలు, రాబోయే దశాబ్దాలలో దేశం ఎదుర్కొనే తీవ్ర నీటి సంక్షోభం, స్థానిక వనరులను కాపాడవలసిన అవసరాన్ని గురించి హెచ్చరిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో 18 శాతం భారతదేశంలో ఉంటే, నాలుగు శాతం మాత్రమే మంచినీటి వనరులను కలిగి ఉంది. నీతి ఆయోగ్ 2018 నివేదిక ప్రకారం, భారతదేశంలో 70% ఉపరితల నీరు కలుషితమయింది. నీటి నాణ్యత సూచికలో 122 దేశాలలో భారతదేశం 120వ స్థానంలో ఉంది. మరొకవైపు, కాంపోజిట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్ నివేదిక, కీలకమైన భూగర్భ జల వనరులు కూడా భారీగా క్షీణిస్తున్నాయని పేర్కొంది. ఇప్పటికే, అరవై కోట్ల మంది భారతీయులు తీవ్ర నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సురక్షిత నీరు అందక ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మంది మరణిస్తున్నారు. దేశంలో తలసరి నీటి లభ్యత, 1951 జనాభా లెక్కల ప్రకారం 5,000 క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువగా ఉంటే, 2021లో అది 1,486 క్యూబిక్ మీటర్లకు పడిపోయిందని సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదిక తెలుపుతోంది.



ఎక్కడ చెరువులు సంరక్షించబడ్డాయో, ఆ ప్రాంతాలలో భూమి పొరల్లోకి నీరు ఇంకి, భూగర్భ జలాలు మెండుగా ఉన్నాయి. భూగర్భ జలాల లభ్యత చెరువుల సంరక్షణతో ముడిపడి ఉంది. ఒకపక్కన స్థిరత్వం లేని రుతుపవనాలు, తుపాన్లతో సతమతమవుతున్న రైతుకి, గ్రామస్థాయిలో నీటి వనరులను పరిరక్షించడం, స్థిరంగా నిర్వహించడం అనేవి చాలా ముఖ్యం. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖలోని మైనర్ ఇరిగేషన్ విభాగం, ముఖ్యంగా గ్రామాలలోనే, 41,737 చెరువులే ప్రధాన వనరులుగా 25.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. కాని, ఈ చెరువులు ఆక్రమణలకు, నిర్వహణ లోపానికి గురయ్యి ప్రతి సంవత్సరం గ్యాప్ ఆయకట్టు పెరుగుతోంది. ఫలితంగా లక్షల ఎకరాలకు సాగునీరు అందించలేకపోతున్నారు. భారతదేశ నీటి సంక్షోభాన్ని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను పరిష్కరించే ప్రయత్నాలలో చెరువులు పునరుద్ధరణ కీలకమైనది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని దశాబ్దాలుగా వివిధ పథకాల ద్వారా గ్రామీణ నీటి వనరుల పునరుద్ధరణకు కోట్లు ఖర్చు చేస్తున్నాయి. జలవనరులు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రత గ్రహించిన కేంద్రం, 2005లో సంప్రదాయ జలవనరుల సమగ్ర మెరుగుదల పునరుద్ధరణ లక్ష్యాలతో 'జలవనరుల మరమ్మతు, పునరుద్ధరణ, పునర్నిర్మాణ' పథకాన్ని ప్రారంభించింది. అలాగే 2015లో వేల కోట్ల వ్యయంతో 'ప్రధానమంత్రి క్రిషి సించాయి' పథకం 'ప్రతీ పొలానికి నీరు' పేరుతో భారతదేశంలోని అన్ని గ్రామాల్లోని ప్రతీ పొలానికి నీరందించే దిశగా కేంద్ర ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించి 2026 వరకు పొడిగించింది. ఇందులో,



సంప్రదాయ జలవనరుల పునరుద్ధరణకు కూడా ఆర్థిక సహకారం అందిస్తుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి జిల్లాలో 75 చెరువులు నిర్మించాలని ఏప్రిల్ 2023లో ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇప్పటికీ, చాలా గ్రామాలలో బ్రిటిష్ హయాంలో లేదా మధ్యయుగాల రాజుల కాలంలో నిర్మించిన లేదా సహజంగా ఏర్పడిన చెరువులే, సాగునీటికి ,తాగునీటికీ మూలాధారం.

జలవనరుల సంరక్షణకు అతిపెద్ద అవరోధం సంప్రదాయ గ్రామీణ జలవనరుల ఆక్రమణలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, ఎన్ని వేల కోట్లు ఖర్చుపెట్టినా ఆక్రమణల విషయంలో పటిష్ఠమైన చర్యలు తీసుకోనిదే దేశం అనుభవిస్తున్న తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కోలేము. దేశంలో కుల రాజకీయాల ప్రభావం పెరుగుతుండటంతో ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడుతూ వస్తున్నాయి.

జలవనరుల పరిరక్షణ జీవవైవిధ్య సంరక్షణకు ఎన్ని గ్రామస్థాయి కమిటీలు వేసినా, ఎలాంటి అర్హత లేని రాజకీయ కార్యకర్తలే సభ్యులుగా ఉంటున్నారు. ఎంతో ఆర్థిక సంపద కలిగిన గ్రామ జలవనరులు, స్థానికంగా ఉన్న అలాంటివారి గుప్పెట్లోకి వెళ్ళిపోతున్నాయి. గ్రామ ఉమ్మడి అవసరాలకు వినియోగించాల్సిన సంప్రదాయ చెరువులు వ్యవసాయ భూములుగా, చేపల చెరువులుగా మారి వాటిలోని రసాయనాలు పర్యావరణ సమతుల్యతకు ఎంత హాని చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేకపోవడానికి ప్రధాన కారణం రాజకీయ ఒత్తిడే. వాటి నుండి వచ్చే ఆర్థిక లాభాలు, అలాంటివారే తస్కరించటంతో, పంచాయతీలకు ఎలాంటి ఆదాయం లేక జలవనరుల నిర్వహణ కష్టతరం అవుతున్నది. జిల్లా కలెక్టర్ నుండి పంచాయతీ కార్యదర్శి వరకు రాజకీయ ఒత్తిళ్ళకు లొంగి ఆక్రమణలను నివారించటంలో విఫలమవుతున్నారు. ఇలాంటి సందర్భాలలో సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు కోర్టులను, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి జలవనరుల పునరుద్ధరణకు పిటిషన్లు వేసారు. కొన్ని సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వమే జలవనరుల భూములను ఇళ్ళ స్థలాలకో, అభివృద్ధి పనులకో కేటాయించినా న్యాయస్థానాలు రాష్ట్రాల బాధ్యతను గుర్తుచేసి, హెచ్చరించాయి కూడా. దేశంలోని అన్ని జలవనరుల సంరక్షణ, పునరుద్ధరణకు చిత్తశుద్ధితో కూడిన సమగ్ర, కఠినమైన విధానాలు, చట్టాలను ప్రవేశపెట్టాలి.

రాష్ట్ర, జిల్లా, గ్రామ పాలనా యంత్రాంగం నిజాయితీతో వాటిని అమలు చేసేలా నిరంతర సమీక్షలు, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, జరిమానాలు విధించాలి. ప్రజాప్రతినిధుల ముసుగులో ఆక్రమణలకు మద్దతిస్తూ, జలవనరుల సంరక్షణ చట్టాలను అమలు చేసే అధికారాల కర్తవ్యాలకు అడ్డుపడుతూ, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న వార్డు సభ్యుడి నుండి, ఎం.ఎల్.ఏ వరకు ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా యుద్ధప్రాతిపదికన అడుగులు వెయ్యాలి. నీటి వనరులను ప్రతి ఒక్కరి అవసరాల కోసం పరిరక్షించాలి. గ్రామస్తులలో ఈ విషయాలపై పూర్తి అవగాహన కలిగించాలి. అందుకు ప్రభుత్వంతోపాటు, పౌర సమాజం కూడా చురుకైన భాగస్వామ్యం తీసుకోవాలి.

**దేశంలోని అన్ని జలవనరుల సంరక్షణ, పునరుద్ధరణకు చిత్తశుద్ధితో కూడిన సమగ్ర, కఠినమైన విధానాలు, చట్టాలను ప్రవేశపెట్టాలి. రాష్ట్ర, జిల్లా, గ్రామ పాలనా యంత్రాంగం నిజాయితీతో వాటిని అమలు చేసేలా నిరంతర సమీక్షలు, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, జరిమానాలు విధించాలి.**

# 'క్రియ' పాఠశాల పిల్లల సృజనోత్సవం







మార్కులే ప్రామాణికం కాదని, ర్యాంకుల కోసం పిల్లల మీద తల్లిదండ్రులు ఒత్తిడి చేయవద్దని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ఒత్తిడి లేకుండా విద్యార్థుల సామర్థ్యాన్ని మదింపు చేసేలా పరీక్షల విధానాన్ని మారిస్తే విద్యలో పెద్దమార్పును చాలా తేలిగ్గా సాధించగలమని, విద్యకు మన సమాజంలో అంత డిమాండ్ ఉందన్నారు.

క్రియ సొసైటీ ఆధ్వర్యంలో 'క్రియ పాఠశాల పిల్లల పండుగ' పేరుతో జరిగే రాష్ట్ర స్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగాయి. బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా జేపీ, అతిథులుగా జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు, డైరెక్టర్ మురళీకృష్ణ, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు, సాదా వెంకటరమణ పాల్గొన్నారు. క్రియ కార్యదర్శి ఎస్‌ఎస్‌ఆర్ జగన్నాథరావు, రాజు తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

జేపీ మాట్లాడుతూ, దేశంలో సుమారు 28 కోట్ల మంది పిల్లలు పాఠశాలల్లో చదువుతున్నారని, వీరందరికీ నాణ్యమైన చదువు అందటం మీదే దేశ సుస్థిరాభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. వీరిలో సాధ్యమైనంత ఎక్కువమంది విద్యాప్రమాణాల్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న పద్ధతుల్లో ఎఫ్‌డీఆర్ పెద్దఎత్తున ప్రయత్నం చేస్తోందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. విద్యార్థుల మానసిక వికాసానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నైపుణ్యం, సామర్థ్యాలుంటే ఉపాధికి కొదవలేదన్నారు. ప్రశ్నించే తత్వం నుంచి సైన్స్ అభివృద్ధి చెందుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో కార్యక్రమానికి తరలివచ్చారు. పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుండి సుమారు 8,000 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. లఘు నాటికలు, శాస్త్రీయ నృత్యాలు, సంగీతం, పాటలు, ఏకపాత్రాభినయం, కోలాటం, క్విజ్, సైన్స్ ప్రయోగాలు మొత్తంగా 29 అంశాలపై జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సొసైటీ సభ్యులు, జేఎన్‌టీయూకేలోని ఎంబీఏ, బీటెక్ విద్యార్థులు, ఆల్‌ఈజ్‌వెల్ ప్రతినిధులు, ఏటీఎస్‌పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వలంటీర్లుగా సేవలందించారు.

# మంచితనం, మానవత కలబోస్తే 'ఆమె'



డాక్టర్ సత్యవతి, డాక్టర్ చంద్రమౌళిగార్ల ఆసుపత్రి అది.. అయినా మండపేట పరిసర ప్రాంతాల వారందరూ ఆ ఆసుపత్రిని సత్తెవతమ్మగారి ఆసుపత్రి' అనే అంటారు. ఈ పిలుపు ఈనాటిది కాదు గత అరవై సంవత్సరాలుగా అందరికీ చిరపరిచితమైనదే. 50-60 సంవత్సరాల వయసున్న వారిలో చాలా మంది చెప్పే మాట ' మేము సత్యవతిగారి హాస్పిటల్లో పుట్టాము' అని. దాదాపు మూడు తరాలుగా అక్కడ పుట్టిన వారు.. వారి బిడ్డలు కళ్లు తెరిచింది అక్కడే! ఆవిడ చేతుల మీద పురుళ్లు పోసుకున్నవారే!! ఆమె ఎందరెందరో మహిళలకు గుర్తుండిపోయే మంచి కాన్పుల డాక్టర్. ఆమె చెయ్యి తిరిగిన గొప్ప డాక్టరే కాక గొప్ప మానసిక వైద్యురాలు కూడా. అంతేకాదు ఎందరెందరికో ఎన్నో సలహాలు, సహాయసహకారాలను అందించారు.

ఆమె ఎంతో నెమ్మదస్తురాలు. గలగల మాట్లాడటం, అతిగా ప్రవర్తించడం ఎరుగని సౌజన్యశీలి. నిదానంగా, ప్రశాంతంగా అతి సామాన్యంగా జీవించటమే ఆమెకు ఎంతో ఇష్టం. ఆవిడ జీవనశైలిలో 'సింప్లిసిటీ' కొట్టొచ్చినట్టు కనబడేది. డాక్టరుగా ఎందరో శిశువులు ఆవిడ చేతుల మీదుగా కళ్లు తెరిచారు. వైద్యురాలిగా ఎందరో శిశువుల కళ్లు తెరిపించిన ఆవిడ ఆడపిల్లలకి ఈ ప్రపంచం కూడా తెలియాలని ఆశించారు. అందుకే చదువే మూలమని భావించి మండపేటలో బాలికోన్నత పాఠశాలకు ఎంతో గొప్ప మనసుతో ధన సహాయమందించిన వితరణ శీలి. వైద్యురాలిగా ఆవిడ గడించిన ఖ్యాతికి తోడు విద్యా ప్రదాతగా కూడా కీర్తి కెక్కి శాశ్వతంగా నిలిచిపోయారు. ఎవరికైనా సాయం చెయ్యాలంటే సత్యవతిగారు ముందుండేవారు. ఎందరికో చదువుకొంటానికి ఆవిడ చేసిన సాయం అంతా ఇంతా కాదు.

'పూవుకు తావి అబ్బినట్టు వైద్యసేవలతో అందరి పట్ల ఆమె చూపే మమతానురాగాలు, అందించే సహకారాలు ఆమెని 'మానవతా మూర్తిగా' నిలబెట్టాయి. సత్యవతమ్మగారి నుండి ఉపశమనం పొందిన రోగులు ఆమెనొక గొప్ప వైద్యురాలిగా గుర్తుపెట్టుకుంటే ఆవిడ పేరుమీదున్న పాఠశాలలో చదివిన, చదువుతున్న, చదవబోయే విద్యార్థుల నోళ్లల్లో ఆవిడెపుడూ చిరస్థాయిగా ఉంటుంది. ఆమె జన్మ ధన్యమైంది. ప్రజల మనిషిగా ఆమె ప్రజల జ్ఞాపకాల్లో ఎప్పటికీ ఉంటారు.

– సిద్ధార్థబక్ష్



**మండపేటకు చెందిన ప్రముఖ వైద్యురాలు పాలడుగు సత్యవతి (87) ఇటీవల గుండెపోటుతో చనిపోయారు. డాక్టర్ పాలడుగు చంద్రమౌళి, సత్యవతి దంపతులు లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో సుదీర్ఘకాలం పనిచేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోను చురుకైన పాత్ర పోషించారు. డాక్టర్ సత్యవతి మృతిపట్ల లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ప్రగాఢసంతాపాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ చంద్రమౌళిని మండపేటలో పరామర్శించారు. మండపేట పట్టణం, పరిసరప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ దంపతులు అవిరళ కృషి చేశారన్నారు. ఈ దంపతుల జీవితాలనుంచి స్ఫూర్తిని పొంది యువత మంచి పౌరులుగా రూపొందాలని ఆయన సూచించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయరాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు డాక్టర్ సత్యవతి మృతి సమాజానికి తీరని లోటన్నారు. డాక్టర్ చంద్రమౌళి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.**

# మన దేశంలో ప్రచారం, ఆర్భాటం ఎక్కువ.. ఫలితం తక్కువ

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో ఆకెళ్ల రాఘవేంద్ర ముఖాముఖి (ఐదో భాగం)




**ప్రశ్న: ఉచితాలు ఇవ్వడం వల్ల లాభాలు..నష్టాలు ఏంటి? ప్రస్తుతం తలసరి ఆదాయం వివరాలు.**

**జేపీ:** ఆర్థికంగా శ్రీలంక ఎంత నాశనం అయిపోయిందో చూశాం. ఈనేపథ్యంలో కొంత లోతుగా ఆలోచించాలి. మనది చాలా పాక్షికమైన ప్రజాస్వామ్యం. ఒక జాతర లాగా, సంతలాగా ఎన్నికల్లో విపరీతమైన పోటీ. ఎన్నికైన తర్వాత వెంటనే బందులు, రాస్తారోకోలు ఉద్యమాలు, నిరసనలు. దీనికే ప్రజాస్వామ్యం పరిమితమైపోయింది. నేను ఓట్ అండ్ షౌట్ ప్రజాస్వామ్యం అంటాను. నిజమైన ప్రజాస్వామ్యం దీనికే పరిమితం కాకూడదు. ఇది ప్రజాస్వామ్యమే కానీ చాలా పాక్షికమైంది. సమస్య ఎక్కడొచ్చిందీ..నేను ఓటు ఎందుకు వేస్తున్నానో తెలియదు. నేను ఒక రాజును ఎన్నుకుంటున్నాను.. ఓటేస్తే ఆయన రాజు అయిపోతున్నాడనే భావన ఉంది. అసలు పన్నులు ఎందుకు కడుతున్నాం..ఆ పన్నుల డబ్బులు ఎందుకు ఉపయోగపడాలి..కృత్రిమంగా రాజ్యాన్ని ఎందుకు పెట్టు కున్నాం..రాజ్యం ఏం చేయాలి. నాజీవితానికి రాజ్యం చేసే పనికి సంబంధం ఏంటి? ఇది అర్థం కాకుండా చేశాం. అధికారాన్ని పూర్తిగా కేంద్రీకరించాం. బీదరికమూ అధికార కేంద్రీకరణ, అసమర్థ పాలన ఈ మూడు కలిశాయి. ఇది ప్రమాదకర కలయిక. కనీస సేవలు మనకు సరిగ్గా అందే ఏర్పాటు లేదు. దీంతో ఎవరికి ఓటేసినా తేడా కనిపించడం లేదు. కొంచెం తేడా ఉండొచ్చు. కానీ అనుకున్నంత తేడా కనిపించడం లేదు. ప్రజలేమో దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నారు. జీవన అవసరాల కోసం అలసిపోతున్నారు. చచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నం అని తీసుకుంటున్నారు. సమస్య చచ్చినోడి పెళ్లి. కట్నం తీసుకోవడం కాదు. కాబట్టి చచ్చినోడి పెళ్లి కాకుండా ఎలా చేయాలి. ఓటు అర్థవంతమైందిగా ఎలా చేయాలి. ఆ ప్రయత్నం దేశంలో జరగకుండా అధికారం కోసం పార్టీల మధ్య పోటీ విపరీతంగా ఉంది కాబట్టి ఒకర్ని మించి ఒకరు ఎన్నికల్లో గెలవడం కోసం డబ్బులు ఇవ్వడం! అది కూడా చాలడం లేదు కాబట్టి ఎన్నికైన తర్వాత తాయిలాలు ఇస్తామనే పరిస్థితి వచ్చింది. పరిష్కారం ఏంటి? అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించాలి. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశాం. ఎన్నికల్లో ఎవరు వచ్చినా కోలాహలం తప్ప ఫలితం లేకుండా ఉంది. దాంతో సహజంగానే ఎన్నికలకు ముందు డబ్బులు పంచడం, ఎన్నికలు అయిన తర్వాత పందేరాలు చేయడం ఇదే పరిపాలనగా నడుస్తుంది. అలాగని బీదదేశంలో సామాన్యులకు తాత్కాలికమైన అవసరాలు తీర్చొద్దా? తీర్చాలి. ఆకలితో ఉన్న వాడికి అన్నం పెట్టకపోతే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడి ఉపయోగం లేదు. కానీ ఎక్కడో ఒక చోట సమతూకం ఉండాలి. ఆ సమతూకం లేకపోతే ఏమవుతుంది..తాత్కాలిక తాయిలాలు ఎన్ని ఇచ్చినా బీదరికం కొనసాగుతూనే ఉంది. ఎన్టీఆర్‌గారు 1983లో కిలో.2 బియ్యం మొదలుపెట్టారు. ఆనాడు 40-50 శాతం మందికి బియ్యం అందాయి. ఆనాడు బహిరంగమార్కెట్‌లో రూ. 3.50-4.00 ఉండేది. అంటే రూపాయిన్నర సబ్సిడీ. ఇవాళ మార్కెట్లో రూ. 30 బియ్యం ఉంటే ఒక్క రూపాయికి 80 శాతం మందికి

ఇస్తున్నారు. మీ లెక్క ప్రకారం బీదరికం పెరిగినట్టే కదా? ఒక్కో కుటుంబానికి ఎంతో కొంత ఇస్తున్నారు. సంతోషమే.. అయితే ఆ కుటుంబాన్ని గుండెల మీద చేయి వేసుకుని చెప్పమనండి..ఈ ఐదేళ్లలో నా భవిష్యత్తు బాగుపడింది, గతం కంటే భవిష్యత్తు బాగుంటుందని చెప్పమనండి. నేను రేపొద్దున మిగతా వాళ్లతో పోటీగలను. నా కుటుంబం మధ్యతరగతి కుటుంబం అవుతుంది. గౌరవంగా బతుకుతుందని చెప్పమనండి. దానికి మార్గం వేయద్దా? కాబట్టి ఆ చైతన్యం ప్రజల్లో కలిగించాలి. అధికారాన్ని వికేంద్రీకరించాలి. విద్య, వైద్యం ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి. ఈ మూడు జరిగితే క్రమ క్రమంగా ఈ తాయిలాల పాత్ర తగ్గుతుంది. తాయిలాలు అసలు లేకుండా ఉండవు..అమెరికా లాంటి సంపన్న దేశాల్లో కూడా తాయిలాలు కోరుకుంటున్నారు. కాబట్టి సమాజంలో తాత్కాలికమైన లబ్దికి దీర్ఘకాలికమైన ప్రయోజనాలకు సంఘర్షణ కుటుంబంలో ఉన్నట్టుగా ఉంది. దీర్ఘకాలిక దృష్టి లేకపోతే ప్రతిరోజూ పరగడుపు అనుకుంటే భవిష్యత్తు నాశనం అవుతుంది. వ్యవస్థలో మార్పులతో పాటు జాతీయస్థాయిలో కూడా కొన్ని ఏర్పాట్లు కావాలి. ఎంతోకొంత సమతూకం వచ్చేట్టుగా అనుత్పాదకమైన ఖర్చు పెరగకుండా ఏర్పాట్లు కావాలి. ఈ మధ్య కొన్ని ఆలోచనలు చేస్తున్నారు. అందరం కూర్చుని ఒక సమతూకాన్ని పాటించాలి. లేకపోతే దేశం చాలా ప్రమాదంలో పడుతుంది.

**ప్రశ్న: పన్నుల విధానాన్ని హేతుబద్ధంగా ఎలా చేయాలి? పన్నులతో ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలు ఇంకా ఏమైనా ఉన్నాయా?**

**జేపీ:** పన్నులు కట్టడం నాగరికతకు చిహ్నం. ఉమ్మడి వసతులు కావాలంటే ఉమ్మడిగా వనరులు కావాలి. అయితే ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి వాటిని ఉమ్మడి వనరుల కోసం ఖర్చు చేయకుండా మింగేస్తుంటే ప్రజల్లో అసహనం వస్తుంది. వలస పాలనతో బ్రిటీషు వాళ్లు పన్నుల డబ్బులు దోచేస్తుంటే దాదాబాయి నౌరోజి దాన్ని 'రాజ్యాంగబద్ధ దోపిడీ' అని ఆనాడే చెప్పారు. 2020-21లో మన జాతీయాదాయం రూ. 236 లక్షల కోట్లు. దానిలో ప్రభుత్వాలు పెట్టిన ఖర్చు రూ. 67 లక్షల కోట్లు. ఇందులో సుమారుగా రూ. 47 లేదా 48 లక్షల కోట్లు పన్నులు రూపంలో వచ్చాయి. రూ. 20 లక్షల కోట్లు మన పేరుతో అప్పులు తీసుకువచ్చారు. ఈ ఏడాది అంచనా ప్రకారం దేశ ఆదాయం రూ. 270 లక్షల కోట్లు ఉంటుంది. ప్రభుత్వాల ఖర్చులు రూ. 80 లక్షల కోట్ల వరకు ఉంటాయి. ఒక్కో మనిషి మీదా 57 వేల రూపాయలు ఖర్చవుతుంది. లోక్‌సత్తా పెట్టిన కొత్తలో రూ. 5 వేలు అన్నాను..తర్వాత రూ.10 వేలు అన్నాను..ఈవేళ రూ. 57 వేలు అయింది. ఆర్థిక సంస్కరణలు వచ్చిన నేపథ్యంలో ఒక్క యూనియన్ ప్రభుత్వం మొత్తం ఖర్చు చూస్తే ఆనాడు రూ. 76వేల కోట్లు. ఈ సంవత్సరం ప్రభుత్వ ఖర్చు రూ. 39లక్షల కోట్లు. మరి ఈ డబ్బు సద్వినియోగం కావాలి కదా! ఈ డబ్బంతా జీతభత్యాలు ఇచ్చుకుంటాం..సేవలు మాత్రం సక్రమంగా అందించం..మేం ఏం పనిచేయాలో ఆ పని చేయమనే పరిస్థితి వస్తే ప్రజలు ఎందుకు సహిస్తారు. సేవలు ఎప్పుడైతే సక్రమంగా అందడం లేదో ఆ కారణంగా తాత్కాలికమైన తాయిలాలు వచ్చాయి.

పాలనాయంత్రాంగం వలస పాలన అవశేషం. కాబట్టి గద్దెమీద కూర్చున్నవాడు గుమస్తా అయినా సరే ఎవరైనా గట్టిగా మాట్లాడితే..నిలదీస్తే 'ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?' అనే ప్రశ్న వస్తుంది. ఇలాంటి భాష ఇతర ప్రజాసామ్య దేశాల్లో ఎక్కడా రాదు. మనలాంటి దేశంలోనే వస్తుంది. ఎవరు ఓటేసి కూర్చోబెట్టారో తెలుసా? ఎవరు పన్ను కట్టారో తెలుసా అని వారిని అప్పుడు ప్రజలు అడగాలి..అయితే అలా అడగం..గట్టిగా అడిగితే మన పని ఆగిపోతుందనే భయం. ఏదో విధంగా పని చేయించుకుందాంలే, ఎందుకు మనకు గొడవ అని భావిస్తున్నారు.. పాలనా యంత్రాంగాన్ని జవాబుదారీగా చేయాలి. ఇవాళ మనదేశంలో అసమతూకం ఉంది. సామాన్య పౌరుడికి సామాన్య ప్రభుత్వ ఉద్యోగికి మధ్య సమతూకం దెబ్బతింది. సమాజంలో నూటికి 90 మందికంటే ఓ సామాన్య ప్రభుత్వ ఉద్యోగి ఆర్థికంగా, సామాజికంగా పలుకుబడి రీత్యా, జీవితంలో భద్రత, అవకాశాల రీత్యా బలవంతుడు. ప్రజాస్వామ్య సమాజాల్లో అలా ఉండదు. మన మధ్యతరగతి సమాజం నిజంగా బలంగా ఉంటే ప్రభుత్వ ఉద్యోగి మధ్యతరగతితో సమానంగా ఉంటాడు కానీ..అంతకంటే పెద్దవాడు కాదు. కానీ మనదగ్గర అలా లేదు. మనది చాలా పేద సమాజం లేదా బాగా దిగువ మధ్యతరగతి ఎక్కువగా ఉన్న సమాజం. అందువల్ల ఒక సామాన్య మధ్యతరగతి ఉద్యోగి అయినా కూడా సామాన్య ప్రజలకంటే కూడా చాలా పెద్దవాడు. అలాంటప్పుడు ప్రభుత్వ యంత్రాంగం జవాబుదారీగా లేకపోతే పెత్తందారీ వ్యవస్థ అవుతుంది. నేను, నాకు కావాల్సిన లాభాలు, దాక్షిణ్యం చెలాయించడం, దొరికితే లంచం తీసుకోవడం.. ఇవి తప్ప సమాజంలో మనము ఒక భాగము, సమాజం పన్నులు కట్టి మనల్ని పోషిస్తోంది, ఇవన్నీ ఉమ్మడి సేవలు, వీరికి మనం సేవలు అందించాలనే స్పృహ లేదని అనడం లేదు. చాలా తక్కువ ఉంది. దీన్ని పెంచాలి. ఇది పెరగాలంటే జవాబుదారీతనం ఉన్న వ్యవస్థ రావాలి. పూర్తిగా ప్రభుత్వ యంత్రాంగంలో కూడా మౌలిక సంస్కరణలు తేవాలి. అధికార వికేంద్రీకరణ, ఉద్యోగ వర్గాలు పన్నుల డబ్బులకు సంబంధించిన స్పృహ...ఎంత వీలైతే అంత పన్నుల డబ్బు అక్కడ కాదు ఇక్కడ ఖర్చయ్యేట్టు చూడాలి..నిర్ణయం ఇక్కడ జరగాలి..అక్కడ కాదు. ఈ పీఎం, సీఎం వ్యవస్థని పెట్టి నా ఊర్లో ఏం జరుగుతుందో నాకు అర్థంకాకుండా చేస్తే పన్నుల డబ్బు ఎటు పోతుందో దేవుడికెరుక. చివరికి మనకు తాయిలాలు మిగులుతాయి. దేశం ఎదుగుబొదుకు లేకుండా ఎల్లకాలం బీద దేశంగానే ఉంటుంది.

**ప్రశ్న: మద్యం, మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో విస్తృతంగా ఉంది. దీన్ని అరికట్టడానికి ఉన్న మార్గాలేంటి? దీనిపై లోక్‌సత్తా ఆలోచన ఏ విధంగా ఉంది.**

**జేపీ:** మానవ సమాజంలో, చరిత్రలో చాలా కీలకమైన ప్రశ్న.

ప్రాచీన సమాజం నుంచి ఇప్పటి వరకు పూర్తి సమాధానం దొరకని ప్రశ్న. స్వేచ్ఛ, నియంత్రణ మధ్య ఎక్కడ ఆ గీత ఉన్నది. అతిగా నియంత్రిస్తే నియంతృత్వం అయిపోతుంది. వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా పోతుంది. విశృంఖలమైన స్వేచ్ఛ ఉన్నట్టయితే వ్యక్తి, అంతకంటే ముందు సమాజం నాశనం కావొచ్చు. ఆ గీత ఎక్కడున్నదన్నది చాలా కష్టమైన అంశం. మద్యపానం మంచిది కాదని కచ్చితంగా చెబుతాం.. ఆపే ప్రయత్నం చేస్తాం. అందులో నాకు ఏమాత్రం సందేహం లేదు. కానీ మన సమస్య ఏంటంటే మద్యనిషేధాన్ని ఎక్కడ చేపట్టినా కూడా అది విషాదానికి దారి తీసింది తప్ప మంచి ఫలితాన్ని ఇవ్వలేదు. 1930 దశకంలో అమెరికాలో రాజ్యాంగాన్నే సవరించి మద్యనిషేధం పెట్టారు. 15-20 ఏళ్ల తర్వాత రాజ్యాంగాన్ని మళ్లీ సవరించి నిషేధాన్ని తొలగించారు. ఈ నిషేధ కాలంలో మాఫియాలు పెరిగాయి..గతంలో మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేశారు. బీహార్‌లో అమలులో ఉంది. ఎక్కడ నిషేధాన్ని అమలు చేసినా కూడా కాపుసారా, నేర ప్రవృత్తి, లంచగొండితనం పెరిగాయి. అలాగని విశృంఖలంగా వదిలేద్దామా? దీనికొక మధ్యేమార్గం కావాలి.. కఠినమైన నియంత్రణ అవసరం. వ్యక్తి స్వేచ్ఛను పూర్తిగా ఆపకుండా అదే సమయంలో వారు బానిసలు కాకుండా, మద్యం మత్తులో నేరాలకు పాల్పడకుండా, సమాజానికి ఇబ్బంది లేకుండా ఒక స్పష్టమైన విధానాన్ని అనుసరించాలి. లోక్‌సత్తా కొన్ని వందల గ్రామాల్లో ప్రజల్ని సంఘటితం చేసింది. ఒక ఊరిలో బెల్టుషాపు ఉన్నట్టయితే దాన్ని నియంత్రించే పని ప్రభుత్వం తీసుకుంటే పని జరగడం లేదు. ఆ పని సమాజానికి ఇచ్చేయండి..ఎక్కడైతే బెల్టుషాపు వద్దనుకుంటారో అక్కడ వారు దాన్ని తీసేస్తారు. ఆ విధంగా అక్కడ ఆగిపోతుంది. మద్యం తాగి ఏ చిన్న నేరం చేసినా దానికి మూడు రెట్లు శిక్ష పెట్టండి..వెంటనే శిక్ష అమలయ్యే ఏర్పాట్లు చేయండి. బహిరంగ మద్యపాన నిషేధం అమలు చేయండి. ఎడిక్షన్‌కు గురైన వారికి వారి జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా మంచి ప్రమాణాలతో వైద్యం అందించండి..ఇలాంటివి అమలు చేయాలి..అంతేకాని గుడ్డెద్దు చేలో పడినట్టుగా ఇది ఆపేశాం..ఇది తేసేశాం అంటే జరిగేది కాదు.

మాదకద్రవ్యాలను నిషేధించాలి..వైద్య అవసరాల నిమిత్తం ఇచ్చే వాటిని కొనసాగించాలి. బానిసలైన వారిని శత్రువులుగా చూడకుండా ఎడిక్షన్ నుంచి బయటపడేందుకు చికిత్సలు ఇవ్వండి. కొన్ని ప్రమాదం లేని మందులు ఉన్నాయి. గంజాయి ఉంది. ప్రపంచంలోని చాలా దేశాలు గంజాయిపై నిషేధాన్ని తొలగిస్తున్నాయి కొద్దిపాటి నియంత్రణ చేసి వదిలేస్తున్నాయి. 1980ల దాకా ఈ దేశంలో గంజాయిపై నిషేధం లేదు. పాశ్చాత్య దేశాల్లో ఉన్న నిషేధాన్ని ఇక్కడ అమలు చేశాం. అక్కడ తొలగించారు. బానిసత్వానికి గురయ్యే మందులు ఉంటే కఠినంగా నియంత్రిద్దాం. ప్రమాదం లేని వాటికి లైసెన్స్ పెట్టి వదిలేద్దాం. ఎక్కడైతే అలా చేశారో అక్కడ మంచి ఫలితాలు వచ్చాయి. పోర్చుగల్‌లో ఒకప్పుడు డ్రగ్స్ మాఫియా భయంకరంగా ఉండేది. వాళ్లు సమగ్ర విధానం పాటించగానే ఆ దేశంలో పరిస్థితులన్నీ మారిపోయాయి. ఆ అనుభవాలు నేర్చుకోకుండా మనం ప్రచారం, ఆర్భాటం ఎక్కువ.. ఫలితం తక్కువ. పిడుక్కి బియ్యానికి ఒకే మంత్రం ఉండకూడదు.

**ప్రశ్న: ఉన్న ఉద్యోగాన్ని వదిలేసి సమాజంలో మార్పు కోసం ముందుకు వచ్చారు..లోక్‌సత్తాను ప్రారంభించారు.. ఈ 25 ఏళ్లలో ఎప్పుడైనా తప్పు చేశాననే అనే భావన కలిగిందా?**


**జేపీ:** ఇది అవసరం..అనవసరమైన పనిచేయడం లేదు. కొందరైనా దీనిలో దిగాలి..తంటాలు పడాలి. అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. పరిణితి సాధించాలి. సమాజానికి ఎంతో కొంత మార్గాన్ని చూపెట్టాలి. మార్గాన్ని చూపెట్టే స్పష్టత ఉన్నా కూడా సమాజం అందుకోవడానికి చాలా కాలం పడుతుంది.. నేను కేవలం పిలుపు ఇచ్చాను..కొన్ని వేల మంది ఇందులో భాగస్వాములయ్యారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న వారు కూడా రాత్రిపగలు పనిచేశారు. ఇక్కడ పనిచేయడం ద్వారా మరో ఐదేళ్లు జీవితం పెరుగుతుంది సార్ అని చెప్పేవారు..సమాజంలో అంత స్ఫూర్తి ఉంది. మనం ఒక మార్గం చూపెట్టాలే కానీ..ఆ మార్గం చూపెట్టే వాళ్లకి కొంత విశ్వసనీయ ఉండి..అది పనికొచ్చేదనే నమ్మకం ఉండాలే కానీ వేలమంది ఈ దేశంలో కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ దేశంలో తపన ఉంది..దానికి మార్గాన్ని చూపించే బాధ్యత మనం తీసుకోవాలి. కచ్చితంగా లోక్‌సత్తా దానికి ఓ చోదక శక్తి అయింది. ఈ దేశంలో కొత్తగా రాజకీయాల గురించి ఆలోచించడం, రాజకీయాల్లో ఉన్న వాళ్లని విలన్లుగా చిత్రీకరించకుండా వ్యవస్థలో ఉన్న సమస్యను గుర్తించి పరిష్కారం సాధించడం, హేతుబద్ధమైన మార్గాన్ని చూపించడం, నిర్దిష్టమైన రంగాల్లో ఏమిటి ప్రామాణికం అన్నది తీసుకువచ్చాం. కొన్ని ఫలితాల్ని సాధించాం..మూడు రాజ్యాంగ సవరణల్ని , ఏడెనిమిది పెద్ద పెద్ద చట్టాలను తీసుకురాగలిగాం. ఎన్నో విజయాలు సాధించాం. అవన్నీ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని తీసుకు రావడానికి చెబుతాను కానీ జరగాల్సింది చాలా ఉంది. అయితే జరిగిన కొద్ది వాటివల్ల ఫలితాలు చాలా వచ్చాయి. రుబెల్లా వ్యాక్సిన్ వల్ల ఏడాదికి రెండు లక్షల మంది వికలాంగులుగా పుట్టకుండా ఆపగలుగుతున్నాం. దానికి విలువ కడితే మనిషి జీవితానికి ఎంత సంతృప్తి కలుగుతుంది. చాలా జరుగుతుందన్న విశ్వాసం ఉంది..కొద్దిగా జరుగుతున్న దానికి సంతోషం ఉంది. ఇంకా చాలా జరగాలన్న స్పృహ కూడా ఉంది. అది ఉన్నప్పుడు వ్యక్తి జీవితం ఏం ఉంది. మనం ఏమీ బికారులం కావడం లేదు. తిండికి లేకుండా మల మల మాడటం లేదు. నా శక్తి, సమయం ఉపయోగిస్తే అత్యధిక ఫలితాలు ఎక్కడ వస్తాయో..అది చేస్తున్నాననే నమ్మకం ఉంది. దాన్ని కొన్ని సందర్భాల్లో రూపాయలతో వెలకట్టలేకపోవచ్చు. కానీ కచ్చితంగా అత్యుత్తమ స్థాయిలో పని జరుగుతోంది.

(ఇంకా ఉంది. . . )

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జూలై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

**బి. ఔషధాల పంపిణీ ప్రక్రియ - పాస్‌బుక్ పద్ధతి**

పి.హెచ్.సి స్థాయి వరకు టి.ఎన్.ఎం.ఎస్.సి మందుల పంపిణీని చేస్తుంది. ఇందుకోసం విలువ–ఆధారిత పాస్‌బుక్ పద్ధతిని అనుసరిస్తుంది. ఇందులో భాగంగా ప్రతి ఆరోగ్య సదుపాయం కూడా తన మందుల సేకరణ నిధుల్లో 90%ను టి.ఎన్.ఎం.ఎస్.సి బహిరంగ అకౌంట్‌లో డిపాజిట్ చేస్తుంది. మిగిలిన 10%ను ఆకస్మిక అవసరాల కోసం సదరు ఆరోగ్య సదుపాయం స్థాయిలోనే కేంద్రీకృత మందుల సేకరణ కోసం అట్టిపెడతారు. ప్రతి సదుపాయానికీ డిపాజిట్ చేసిన మొత్తాన్ని అనుసరించి కొంత అదనపు పరిమితి అవకాశంతో పాస్‌బుక్‌ని ఇస్తారు. ఒక సరకు సరఫరా అవసరమైనప్పుడు, దగ్గర్లోని గిడ్డంగికి సదరు సదుపాయం సమాచారం అందించాల్సి ఉంటుంది. ఆ ఆర్డర్‌ని గిడ్డంగి తీర్చటంతోపాటు, పంపిణీ వివరాలు పాస్‌బుక్‌లో నమోదవుతాయి (ఔషధం/వస్తువు పేరు, విలువ రెండూ). సదుపాయాల్లో అవసరాన్ని, జరుగుతున్న సరఫరాల్ని సమర్థవంతంగా ఎప్పటికప్పుడు నమోదు చేయటం ద్వారా ఔషధాలు, ఇతర వస్తువుల సరఫరాలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పాస్‌బుక్ పద్ధతి మరింత పెంచుతుంది.

**సి. శాస్త్రీయమైన జాబితాల నిర్వహణ వ్యవస్థ**

కంప్యూటరీకరించిన జాబితాల నిర్వహణ వ్యవస్థ అన్ని

గోదాముల్లోని జాబితాల్లో ఉన్న ఔషధాలను, వస్తువులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంటుంది (రియల్ టైమ్ ట్రాకింగ్). ఏడాదిలో 'ముమ్ముందు అవసరం పడే ఆర్డర్ పరిమాణాన్ని' సాఫ్ట్‌వేర్ సాధనాల ద్వారా ముందుగానే అంచనావేసేలా శాస్త్రీయ గిడ్డంగుల పద్ధతుల్ని వినియోగిస్తారు.

కంప్యూటర్ ద్వారా జాబితాల నిర్వహణను రోగికి మందులు పంపిణీ చేసే చివరి సదుపాయమైన ఔషధ దుకాణం వరకూ విస్తరిస్తారు. పాత నిల్వల్ని ముందుగా ఖాళీ చేసేలా, ముందుగా సరఫరా చేసిన సరకు ముందుగా పంపిణీ అయ్యేలా చేస్తారు.

మందులు కాలంచెల్లి వృధా కాకుండా, గిడ్డంగుల మధ్య వాటిని సర్దుబాటు చేస్తారు. నిల్వను వినియోగించుకోవటానికి వీలుగా, ఒక నిర్దిష్ట గోదాములో ఎక్కువ సరఫరా అయిన మందుల్ని, మరో గోదాముకు తరలిస్తారు. అదే విధంగా, సమర్థ వినియోగానికి వీలుగా, స్వల్ప కాల వ్యవధిలో కాలంచెల్లే మందులను ప్రతి పక్షం రోజులకోసారి విశ్లేషిస్తారు.

**డి. ఫలితాలు**

1. ఔషధాలు అవసరానికి తగ్గట్లు అందుబాటు – వినియోగ ధోరణులను అనుసరించి జాబితాల శాస్త్రీయ నిర్వహణ, స్థానికంగా నిర్ధారించిన ఇ.డి.ఎల్‌ల ద్వారా ఆరోగ్య సదుపాయాల్లో ఔషధాలు ఎక్కువ తక్కువ కాకుండా నివారించవచ్చు.

2. పోటీతత్వం – పారదర్శక టెండరింగ్ ప్రక్రియ దరఖాస్తుదారుల్లో నమ్మకాన్ని నింపి, ధరల బిడ్ల మధ్య పోటీతత్వాన్ని పెంచుతుంది.

3. సేకరణలో ధరల నియంత్రణ – టి.ఎన్.ఎం.ఎస్.సి నమూనాలోని అత్యంత పోటీతత్వంతో కూడిన బిడ్డింగ్ ప్రక్రియ, కేంద్రీకృత ధర–కాంట్రాక్టింగ్–చెల్లింపు పద్ధతి, స్థానిక ఇ.డి.ఎల్ (అనవసర సేకరణ లేకుండా) వంటి అనేక అంశాలు గరిష్ట వ్యయ ప్రయోజనానికి దోహదం చేశాయి. మొత్తం 32 రకాల్లో యాదృచ్ఛికం (ర్యాండమ్) గా ఎంపిక చేసిన 17 మందుల ధరల్ని 5 రాష్ట్రాల మధ్య పోల్చినపుడు తమిళనాడులోనే తక్కువగా ఉన్నాయని సింగ్ పి.వి ప్రభృతులు వెల్లడించారు.

4. మందులపై ఓ.ఓ.పి.ఇ తగ్గుదల –

మందులపై ఓ.ఓ.పి.ఇ వల్ల పేదరికం తమిళనాడులో 1993–94 నుండి 2004–05 మధ్య భారీగా తగ్గింది (4.2% నుండి 1.7 శాతానికి – అంటే 60% తగ్గింది. అదే జాతీయ సగటు 3.6% నుండి 2.9 శాతానికి – అంటే 20% మాత్రమే తగ్గింది) (సెల్వరాజ్ ప్రభృతులు, 2017).


అలాగే, నెలవారీ తలసరి వినియోగ వ్యయంలో పోల్చదగిన ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే, తమిళనాడులోనే ఓ.ఓ.పి.ఇ (2011–12)లో మందుల వాటా తక్కువగా ఉంది. నిజానికి, ఢిల్లీని మినహాయిస్తే, అన్ని పెద్ద రాష్ట్రాలలో తమిళనాడుదే ఈ విషయంలో అతి తక్కువ వాటా (సెల్వరాజ్ ప్రభృతులు, 2017).

ప్రభుత్వ సదుపాయాలలో ఆస్పత్రి సేవల వ్యయంలో మందుల వాటా తక్కువగా ఉండటం టి.ఎన్.ఎం.ఎస్.సి నమూనా సమర్థతకు మరో నిదర్శనం. ఉదాహరణకి, ప్రభుత్వ సదుపాయాల్లో ఆస్పత్రిలో చేరిన ఒక్కో కేసుకూ మందుల వ్యయం 2004–05లో రూ.100–140గా ఉంది. ఇది జాతీయ సగటు (రూ.880–1000)లో ఎనిమిదో వంతు మాత్రమే (సెల్వరాజ్ ప్రభృతులు, 2017).

**ఇ. కీలక అంశాలు**

- స్వయంప్రతిపత్తి గల మందుల సేకరణ సంస్థ – పారదర్శకత, స్వతంత్ర నిర్ణయం, వేగంగా చెల్లింపు ప్రక్రియల కోసం
- కేంద్రీకృత – సేకరణ, పంపిణీ
- కచ్చితమైన నిబంధనలు, నియంత్రణలు – పోటీని పెంచటం, నాణ్యతను అమలు చేయటం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం కోసం
- స్థానికీకరించిన ఇ.డి.ఎల్ – పరిమిత ఆర్థిక వనరుల సద్వినియోగం కోసం
- రాజకీయ/శాసన మద్దతు – ప్రారంభ పెట్టుబడి వ్యయానికి, నిర్వహణ ఖర్చులకు బడ్జెట్‌లో తగినన్ని నిధుల రూపంలో
- బహుళ భాగస్వాములకు పాత్ర – వ్యవస్థలో పారదర్శకత, తద్వారా బిడ్డర్లలో విశ్వాసాన్ని పెంచేందుకు
- సమాచార సాంకేతికత వినియోగం – శాస్త్రీయంగా జాబితాల నిర్వహణ, చెల్లింపు, నిల్వలను ఎప్పటికప్పుడు నమోదు చేయటం కోసం
- నాణ్యతా పరీక్ష – థర్డ్ పార్టీ ద్వారా
- పారదర్శకత – సరకు అందటంతోనే చెల్లింపులు, నాణ్యతా నియంత్రణ, ఐటీ పద్ధతుల వినియోగం ద్వారా..

(ఇంకా ఉంది. . . )



ప్రభుత్వోద్యోగిగా రిటైరయ్యే సమయంలో
నా నెల జీతం రూ.40,000. కానీ ఈవేళ నా పెన్షన్ రూ.1,60,000.
నాలాంటి ఉద్యోగులు సర్వీస్ లో ఉండగా ఒక్కరూపాయి జమ చేయకుండా నిరంతరం పెరిగిపోతుండే ఈ రకమైన పాత పెన్షన్ పద్ధతి (OPS) అన్యాయమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకి ప్రమాదకరం. బ్రిటిష్ వలసకాలం నాటి ఈ పద్ధతిని వదిలించుకుందాం. ప్రతి నెలా ఉద్యోగులు, ప్రభుత్వం కొంత డబ్బు జమచేసి వచ్చేతరం మీద భారం లేకుండా జీతాలు, పెన్షన్లకు గ్యారంటీ ఇచ్చే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (NPS) కొనసాగిద్దాం.
- ఆంజనేయ రెడ్డి,
మాజీ DGP
SAY NO TO
Old Pension Scheme
REFUSE IT DEFUSE IT!
SCAN HERE TO
VOTE
WWW.REFUSEOPS.IN

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th December, 2023 Posting Date 15 &16th of every month

బ్యాలెట్ కంటే పవర్‌ఫుల్

www.refuseops.inలో మీ Vote




*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**